# ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులు మేల్కొంటారా..?

- సీతారామ కెనాల్ బ్రిడ్జిపై పొంచి ఉన్న పెను ప్రమాదం
- గుంతలు పైకి తేలిన ఇనుప రాడ్లు.
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి.

7




TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 85 | హైదరాబాద్ | ఆదివారం 13-09-2026 | పేజీలు: 08


## ఆదిలాబాద్ విమానాశ్రయం వేగవంతం

ఆదిలాబాద్ విమానాశ్రయానికి అడుగులు వేగం
కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలుకు కీలక ముందడుగు
రాజ్‌నాథ్, రామ్మోహన్ నాయుడుతో కిషన్‌రెడ్డి భేటీ
జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్
ఏర్పాటుకు రక్షణ శాఖ సుముఖత
ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర మంత్రులతో సమీక్ష
వచ్చే వారంలో ముగ్గురు నోడల్ అధికారుల నియామకం
డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన వేగవంతం

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో శనివారం సమావేశమైనట్లు వెల్లడించారు. సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు.

**వచ్చే వారంలో నోడల్ అధికారుల నియామకం**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం తరఫున ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని

మిగతా 7లో..



## హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

### 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్యూర్ చట్టం

నగర రవాణాకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్
మూసీ తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు
20 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు చర్యలు
జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించాం
అన్ని సంస్థల సమన్వయానికి చట్టబద్ధ వ్యవస్థ
సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలి
మురుగునీటిని శుద్ధి చేసి పచ్చదనానికి వినియోగం
2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
ప్రపంచ నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ అభివృద్ధి



**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నగర విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమర్థమైన పాలన అందించేందుకు కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) చట్టాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ శాసనసభలో క్యూర్ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు.

**సమగ్ర రవాణా ప్రణాళిక**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపొందించామని శ్రీధర్‌బాబు తెలిపారు. నగరం పెద్దఎత్తున విస్తరిస్తున్నందున భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను కూడా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా

మిగతా 7లో..



బీఎస్పీ వారసత్వంలో మాయావతి

## ఊహించని ట్విస్ట్..

కుటుంబ పాలనకు నో..
వారసత్వ రాజకీయాలకు చెక్
సోదరుడి కుమారులకు రాజకీయ బాధ్యతలు లేవంటూ మాయావతి స్పష్టత
దీపికా ఆనంద్‌కు కీలక బాధ్యతలపై సంకేతాలు
న్యాయవిద్య చదువుతున్న దీపికాపై మాయావతి ఫోకస్
BSPలో కొత్త రాజకీయ వారసత్వంపై ఆసక్తికర చర్చ
కుటుంబానికి ఒక న్యాయం.. పార్టీలో మరో వ్యూహమా?

**ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో**

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) అధినేత్రి మాయావతి మరోసారి సంచలన నిర్ణయంతో రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశారు. పార్టీలో కుటుంబ పాలనకు తావులేదని నినదిస్తూనే.. తన సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులను రాజకీయ బాధ్యతలకు శాశ్వతంగా దూరం పెడుతున్నట్లు కుండబద్దలు కొట్టారు. అదే సమయంలో ఆయన కుమార్తె, న్యాయవిద్య అభ్యసిస్తున్న కుమారి దీపికా ఆనంద్‌కు కీలక బాధ్యతలు

మిగతా 7లో..

## భారత్, చైనా కలిసి సాగాలి

మోదీతో జిన్‌పింగ్ భేటీ..
ఢిల్లీలో మోదీ, జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు
ఇరు దేశాల సంబంధాలపై కీలక అంశాల ప్రస్తావన
భారత్, చైనా కలిసి నడవాలని జిన్‌పింగ్ పిలుపు
ఆధునిక సాంకేతికతతో వేగంగా పురోగతి సాధిద్దామని వ్యాఖ్య
పరస్పర సామర్థ్యాల నుంచి నేర్చుకోవాలని సూచన
దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలకు చైనా సిద్ధం
మోదీని ఇప్పటివరకు 21సార్లు కలిశానన్న జిన్‌పింగ్
భారత్‌చైనా సంబంధాలు స్థిరమైన అభివృద్ధి దిశలో ఉన్నాయని వ్యాఖ్య
బ్రిక్స్ సదస్సుకు చైనా సహకారంపై మోదీ కృతజ్ఞతలు
ద్వైపాక్షిక సహకారంపై విస్తృతంగా చర్చించిన ఇరువురు



**ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో**

దిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం ఇరు దేశాల తరఫున ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

**కలిసి ముందుకు సాగాలి**

ప్రపంచంలోని అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి ముందుకు సాగాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని ఇరు దేశాలు వేగంగా పురోగతి

మిగతా 7లో..

## ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

రెవెన్యూ సంస్కరణల లక్ష్యం ప్రజల ఆస్తుల పరిరక్షణే
ధరణితో గత పాలకులు భూముల అక్రమాలు
స్వప్రయోజనాలకు లక్షలాది ఎకరాలు
అర్ధరాత్రి వేళల్లోనూ రిజిస్ట్రేషన్లు జరిగాయి
ధరణి తప్పిదాలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారు
భూమి లేకుండానే పాసుపుస్తకాలు ఇచ్చారు
నకిలీ పట్టాలతో రైతుబంధు నిధులు దుర్వినియోగమయ్యాయి
125 ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వే చేపట్టాం
ఇప్పటివరకు 5 లక్షలకు పైగా దరఖాస్తుల పరిష్కారం
భూభారతిలో 80 మాడ్యూల్స్‌కు బదులు 5 మాత్రమే
47,440 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాం





**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా గత పాలకుల భూ వ్యవహారాల బండారం బయటపడుతుండటంతోనే వారు సభకు రాకుండా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో

మిగతా 7లో..

## 80ల నాటి ఫొటోలతో జాగ్రత్త

సైబర్ మోసాలు జరిగే అవకాశం
1980ల నాటి ఫొటోలుగా మార్చే ట్రెండ్ వైరల్
సోషల్ మీడియా ప్రకటనలతో సైబర్ నేరగాళ్ల వల
ఉచితంగా ఎడిటింగ్ చేస్తామంటూ ఆకర్షించే అవకాశం
అనుమానాస్పద లింకులపై క్లిక్ చేస్తే ప్రమాదం
ఎస్ఎంఎస్, ఓటీపీ వివరాలు తస్కరించే ముప్పు
కాంటాక్టులు, వ్యక్తిగత సమాచారానికీ భద్రత కరువు
బ్యాంకింగ్, ఆర్థిక సమాచారంపై నేరగాళ్ల కన్ను
ఆర్థిక మోసాలు, గుర్తింపు దుర్వినియోగానికి అవకాశం
అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచన




**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 1980ల నాటి రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్‌ను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. సాధారణ ఫొటోలను 1980ల నాటి రెట్రో ఫొటోలుగా మార్చుతామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా ప్రజలను ఆకర్షించే అవకాశం

మిగతా 7లో..

## మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్



తన డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయానన్న కేరళ సీఎం
మోహన్‌లాల్, విజయ్ కంటే తానే బాగా డ్యాన్స్ చేశానని సరదా వ్యాఖ్య
కేరళలో విద్యుత్ సంక్షోభంపై విమర్శల నడుమ వైరల్ అయిన వీడియో
వినోదం కోసమేనని, ఎవరినీ కించపరచలేదని స్పష్టం చేసిన క్రియేటర్లు
డిజిటల్ టెక్నాలజీ సవాళ్లపై జరిగిన సెమినార్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు

**ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో**

కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.

శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్

మిగతా 7లో..

## ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు
ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి
భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం
ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన
అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత
చర్చలు, దౌత్యంతో వివాదాల పరిష్కారానికి పిలుపు
అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ
అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు
తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు
పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు




2

# ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

మొదటిపేజీ తరువాయి

జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి మాట్లాడారు.

**ధరణితో భూముల అక్రమాలు**

తెలంగాణను పోరాడి సాధించుకున్నప్పటికీ గత పాలకులు రాష్ట్రాన్ని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా భావించారని అన్నారు.

ధరణి పోర్టల్ నిర్వహణను దివాళా తీసిన విదేశీ సంస్థకు అప్పగించారని, పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకుని అర్ధరాత్రి వేళల్లోనూ రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లో చోటుచేసుకున్న తప్పుల కారణంగా లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. ఈ వ్యవస్థ కారణంగా వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

**5 లక్షలకు పైగా దరఖాస్తుల పరిష్కారం**

రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవని మంత్రి తెలిపారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని చెప్పారు. ధరణి అమల్లో ఉన్నప్పుడు 2.49 లక్షల దరఖాస్తులు ఉండగా.. భూభారతి అమల్లోకి వచ్చిన తర్వాత మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. మొత్తం 5 లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు.

పరిష్కరించలేని దరఖాస్తులను ఏ కారణంతో పరిష్కరించలేదో కూడా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో భూముల సర్వే పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు.

**భూమి లేకుండానే పాసుపుస్తకాలా?**

గత పాలనలో భూములు లేకపోయినా పాసుపుస్తకాలు ఇచ్చారని పొంగులేటి ఆరోపించారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చి రాజకీయ అనుచరులు, బంధువులకు పాసుపుస్తకాలు ఇచ్చారని విమర్శించారు. భూమి లేని వారికి సైతం రైతుబంధు అందించి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. నల్గొండ జిల్లాలో 14 వేల ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 4 వేల ఎకరాలకు దొంగపట్టాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ధరణిలో 80 మాడ్యూల్స్ ఏర్పాటు చేసి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని, భూభారతి చట్టంలో వాటి సంఖ్యను కేవలం ఐదుకు తగ్గించామని వివరించారు.

**22ఏపై బీఆర్ఎస్‌ను నిలదీత**

25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవమేనని మంత్రి తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఉన్నారని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇచ్చిందన్నారు.

అసైన్డ్ భూములు ఉమ్మడి రాష్ట్రం నుంచే నిషేధిత జాబితాలో ఉన్నాయని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. అసైన్డ్ భూముల విషయంలో ఏం చేయాలో సలహాలు ఇవ్వాలని కోరారు.

**47,440 ఎకరాలు 22ఏ నుంచి తొలగింపు**

ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పొంగులేటి తెలిపారు. ఇందులో 96,36,777 ఎకరాలు ప్రభుత్వ వ్యవసాయ భూములు, 3,73,930 ఎకరాలు ప్రైవేటు వ్యవసాయ భూములు, 1,94,543 ఎకరాలు వ్యవసాయేతర భూములు, 5,12,792 ఎకరాలు ఎండోమెంట్ భూములు ఉన్నాయని వివరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటితో పోలిస్తే ప్రస్తుతం నిషేధిత జాబితాలోని భూములు 47,440 ఎకరాలు తగ్గాయని చెప్పారు. ఇందులో 23 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20 వేల ఎకరాలను తొలగించామని వివరించారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాలకు సంబంధించిన లెక్కలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

అయితే బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23 వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ పేర్కొందని మంత్రి అన్నారు. భువనగిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన విషయం ప్రస్తావిస్తూ.. అవన్నీ అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లేనని వివరించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని రాందాస్‌పల్లిలో 1,300 ఎకరాలపై హరీశ్‌రావు మాట్లాడారని, ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని పొంగులేటి ప్రశ్నించారు.




# మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్

మొదటిపేజీ తరువాయి

ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం.

ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




# హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

మొదటిపేజీ తరువాయి

విభజించామని, నగరంలోని అన్ని ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**మూసీ పునరుజ్జీవానికి భారీ నిధులు**

మూసీ పునరుజ్జీవం తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నగర భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణకు వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంపై దృష్టి పెట్టామని తెలిపారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకెళ్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలని ఆకాంక్షించారు.

పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించే స్థాయికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర గత వైభవాన్ని కాపాడుకుంటూనే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**400 రకాల నేరాల తొలగింపు**

తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన సుమారు 400 రకాల నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

ఈచట్టంఅమలుతోవ్యాపారనిర్వహణమరింతసులభతరం అవుతుందని చెప్పారు. చిన్నపాటి కేసుల కారణంగా అనేక సందర్భాల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం రాష్ట్రంలో అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టంలోని నిబంధనలపై కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# భారత్, చైనా కలిసి సాగాలి

మొదటిపేజీ తరువాయి

సాధించగలవని అన్నారు.

ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు.

**మోదీని 21 సార్లు కలిశా**

బ్రిక్స్ సదస్సుకు సంబంధించి తన పుట్టిన రోజునే భారత్ నుంచి ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని తెలిపారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరమైన అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

**చైనా సహకారానికి మోదీ కృతజ్ఞతలు**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందిస్తున్న మద్దతు, సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు జిన్‌పింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ తెలిపారు. బ్రిక్స్ వేదికగా భారత్, చైనా సహకారం మరింత విస్తరించే అవకాశాలపైనా ఇరువురు నేతలు దృష్టి సారించారు.

# 80ల నాటి ఫొటోలతో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి




ఉందని తెలిపారు.ఉచితంగా లేదా అపరిమితంగా ఫొటో ఎడిటింగ్ సదుపాయం కల్పిస్తామంటూ నమ్మబలికి అనుమానాస్పద లింకులను పంపే అవకాశం ఉందని శిఖా గోయల్ పేర్కొన్నారు. అలాంటి లింకులపై క్లిక్ చేసి ఫైళ్లను డౌన్‌లోడ్ చేస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఏపీకే ఫైళ్ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

ఇలాంటి మోసాల ద్వారా మొబైల్‌లో భద్రపరిచిన ఎస్ ఎంఎస్, ఓటీపీలు, కాంటాక్టులు, బ్యాంకింగ్ వివరాలు, ఆర్థిక సమాచారం, వ్యక్తిగత సమాచారంతో పాటు ఇతర సున్నితమైన డేటాను నిందితులు దొంగిలించే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆర్థిక మోసాలు, అనధికారిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని శిఖా గోయల్ సూచించారు. రెట్రో ఫొటో ఎడిటింగ్ పేరుతో వచ్చే ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎవరైనా ఇలాంటి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

- **ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు**
- **ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి**
- **భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం**
- **ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన**
- **అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత**
- **చర్చలు, దౌత్యంతో వివాదాల పరిష్కారానికి పిలుపు**
- **అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ**
- **అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**
- **తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు**
- **పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు**

ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో

దిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాలు ఆమోదం తెలిపాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ.. ఇరుదేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా డిక్లరేషన్‌కు అంగీకారం తెలిపాయి. భారత్ దౌత్య నైపుణ్యంతో సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించినట్లు తెలుస్తోంది.

**ఏకపక్ష సుంకాలపై ఆందోళన**

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా సుంకాలు విధించడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా చేపట్టే ఏకపక్ష నిర్బంధ చర్యలను ఖండించాయి.

అంతర్జాతీయ వివాదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు నేతలు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో పరస్పర సహకారం ప్రాముఖ్యతను బ్రిక్స్ దేశాలు పునరుద్ఘాటించాయి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. తీవ్రవాద కార్యకలాపాలను బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు తీవ్రంగా ఖండించింది. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన అవసరం ఉందని నేతలు స్పష్టం చేశారు.

**పహల్గాం ఉగ్రదాడికి ఖండన**

గతేడాది జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాల నేతలు ఖండించారు. సీమాంతర ఉగ్రవాదం, తీవ్రవాద చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.

**నేతలకు మోదీ ప్రత్యేక విందు**

బ్రిక్స్ సదస్సుకు హాజరైన దేశాల నేతలు అనంతరం 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అక్కడ ఫొటోలు దిగడంతో పాటు మొక్కలు నాటారు. రాత్రి 7.30 గంటలకు సదస్సుకు హాజరైన నేతలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక విందు ఇవ్వనున్నారు.




# బీఎస్పీ వారసత్వంలో మాయావతి ఊహించని ట్విస్ట్..

మొదటిపేజీ తరువాయి

అప్పగించే సూచనలు ఇవ్వడం ద్వారా సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపారు.

**కొడుకులకు దక్కని పగ్గాలు..**
**తెరపైకి కుమారి దీపిక**

బీఎస్పీని కుటుంబ పాలన జాఢ్యం నుంచి కాపాడటమే తన పరమ లక్ష్యమని మాయావతి స్పష్టం చేశారు. అవివాహితురాలినైన తనకు భద్రత అవసరాల రీత్యా తోడుగా ఉన్న సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులెవరికీ.. బీఎస్పీలో చిన్న, పెద్ద ఎలాంటి పదవులూ ఇచ్చే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. అంతేకాదు, భవిష్యత్తులో వారి సంతానానికి కూడా పార్టీలో స్థానం ఉండదని కఠిన నిబంధన విధించారు. అయితే ఆనంద్ కుమార్‌కు సాయం చేసే నెపంతో ఆయన కుమార్తె దీపికా ఆనంద్ రాజకీయ అరంగేట్రానికి మాత్రం పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిజాయితీ, విధేయత, పనితీరు ఆధారంగా ఆమెకు బాధ్యతలు కట్టబెట్టవచ్చని, ఒకవేళ దీపిక అందుకు ముందుకు రాకపోతే బహుజన్ సమాజానికి చెందిన నిబద్ధత కలిగిన మిషనరీ కార్యకర్తకే ఆ అవకాశం దక్కుతుందని వెల్లడించారు.

**జెన్-జీ, జెన్-ఆల్ఫాపై దృష్టి..**
**50 శాతం యువతకే పెద్దపీట**

రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త తరం యువ నాయకత్వాన్ని తెరపైకి తీసుకురావడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు మాయావతి తెలిపారు. జెన్‌జీ, జెన్‌ఆల్ఫా ఆలోచనలకు అనుగుణంగా పార్టీలో 50 శాతం మేర సంస్థాగత బాధ్యతలను యువతకే కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యాంగ విలువలు, అంబేద్కర్‌వాద సిద్ధాంతాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే కొత్త తరాన్ని నిర్మించడమే తన సంకల్పమని పేర్కొన్నారు. నాలుగు సార్లు బీఎస్పీ సాగించిన సుపరిపాలనలో రోడ్లు, తాగునీరు, విద్య, ఉపాధి, రక్షణ రంగాల్లో మైలురాళ్ళు సాధించామని, పల్లెల నుంచి వలసలను అడ్డుకున్నామని మాయావతి గుర్తుచేశారు. 2012లో విపక్షాలు సాగించిన కులతత్వ రాజకీయాల కారణంగానే బీఎస్పీ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చట్టబద్ధ పాలన అటకెక్కిందని, బీఎస్పీ మళ్లీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు ప్రత్యర్థులు 'సామ, దాన, భేద, దండోపాయాలు' ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు.

క్రమశిక్షణారాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా బయటకు పంపిన నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకుంటున్నారంటూ సాగుతున్న ప్రచారాన్ని ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. అదంతా తప్పుడు ప్రచారమని, క్రమశిక్షణ ఉల్లంఘించిన ఏ ఒక్కరికీ బీఎస్పీ తలుపులు తిరిగి తెరుచుకోవని తేల్చిచెప్పారు. అంబేద్కర్‌వాద ఆశయ సాధనకు కార్యకర్తలు పూర్తి శక్తితో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయం వేగవంతం

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించినట్లు చెప్పారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ అవసరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

**రక్షణ శాఖ సుముఖత**

ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు, వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని పేర్కొన్నారు.

**2.75 కిలోమీటర్ల రన్‌వే**

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఇప్పటికే పలుమార్లు సమావేశమైనట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. 2026 ఏప్రిల్ 17న అధికారులు విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారని, 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని నిర్ణయించారని చెప్పారు. ప్రస్తుతం ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, శిక్షణ, నిర్వహణ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సివిల్ టెర్మినల్, ఎంఆర్‌ఓ కేంద్రం**

పౌర విమాన సేవలకు అవసరమైన సివిల్ టెర్మినల్‌ను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. విమానాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఎంఆర్‌ఓ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు.



# అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

ప్రజాక్షేత్రం



అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీ లాబీలో శనివారం చిట్‌చాట్ సందర్భంగా సీతక్క బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఎర్రవల్లిలో ఎల్పీ మీటింగ్ నిర్వహించి, పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే పసుపు నీళ్లతో శుద్ధి చేశారని, ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతో ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్, మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమం పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాంహౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ మినహా దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ అంటే ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారాని నిదర్శనమన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు.. అధికారం పోయినా అహంకారం ఇంకా పోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని జోస్యం చెప్పారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- **ఈ నెల 19న లక్కారం వి.వి. ఆర్ గార్డెన్ లో 'మెగా జాబ్ మేళా'**
- **ఇ ఎల్ వి భాస్కర్**



**చౌటుప్పల్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. శనివారం అయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ మండల పరిధిలోని లక్కారం లోని వివిఆర్ గార్డెన్స్ లో ఇఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న "మెగా జాబ్ మేళా" నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 70కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరై అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ వంటి ఏ విద్యార్హత కలిగిన యువత హాజరు కావాలని కోరారు. అభ్యర్థులకు ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95508 43338 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



# శ్రీ గాయత్రీ కళాశాలలో ఘనంగా "శ్రీ గాయత్రీయన్స్ సింఫోనియా – ఫ్రెషర్స్ పార్టీ

**చౌటుప్పల్ సెప్టెంబర్, 12(ప్రజాక్షేత్రం):** శ్రీ గాయత్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించిన "శ్రీ గాయత్రీయన్ సింఫోనియా ఫ్రెషర్స్ పార్టీ" శనివారం చౌటుప్పల్‌లోని వి.వి.ఆర్. గార్డెన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ గాయత్రీ కళాశాల చైర్మన్ శ్రీ బండారు మయూర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు మయూర్ రెడ్డి మాట్లాడుతూ, విద్య ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం అని అన్నారు. విద్యలో రాణిస్తే గౌరవం, ఆర్థిక స్థిరత్వం, మంచి భవిష్యత్తు వాటంతటవే వస్తాయని తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం విద్యను ఆయుధంగా చేసుకుని దేశ అత్యున్నత స్థాయికి ఎదిగారని, ఆయన జీవితమే విద్య యొక్క గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. "పేదవారిగా పుట్టడం మన తప్పు కాదు.. కానీ పేదరికాన్ని జయించేందుకు ప్రయత్నించకపోవడం మాత్రం మన తప్పు" అని విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, జీవితంలో సమయానికి ఎంతో విలువ ఉందని, ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా లక్ష్య సాధన కోసం కష్టపడి, ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీ భీమిడి సుభాష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, శ్రీ గాయత్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యపై ఉన్న మమకారంతో కళాశాలలను నిర్వహిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా ధైర్యంగా చదువుకునే వాతావరణాన్ని కళాశాలలో కల్పిస్తున్నామని, కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసులు, స్టడీ క్లాసులను నిర్వహిస్తున్నాము అని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే శ్రీ గాయత్రీ కళాశాల జాతీయస్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, నీట్, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలైన ఎప్ సెట్ తదితర పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఫ్రెషర్స్ పార్టీ సందడిగా సాగి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించింది.

ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగిసిన అఖండ శివనామ సప్తాహ

- **భక్తి పరవశంలో మునిగి తేలిన పోచారం కాలనీ**
- **బిజెపి నాయకులు కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం**

**కోటగిరి సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** శ్రావణమాసంను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని పోచారం కాలనీలో గల అభయ బసవేశ్వర ఆలయంలో రామరాజు యూత్ ఆధ్వర్యంలో గత వారం రోజుల నుండి తృతీయ అఖండ శివనామ సప్తహ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 5వ తేది నుండి శనివారం వరకు కొనసాగిన శివనామ సప్తాహ సందర్భంగా పోచారం కాలనీ భక్తి పారవశంలో మునిగి తేలింది. శివశక్తి పారాయణ్ మల్లికార్జున్ మహారాజ్ ఆధ్వర్యంలో 7 రోజులు భజనలు కీర్తనలు చేశారు. శనివారం సప్తహ ముగింపు కార్యక్రమం సందర్భంగా బిజెపి పార్టీ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యంలో కోనేరు శశాంక్ ను శాలువాతో సన్మానం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శివశక్తి పారాయణ్ మల్లికార్జున్ మహారాజ్ మాట్లాడుతూ.... శ్రీ అభయ బసవేశ్వర ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా తృతీయ అఖండ శివనామ సప్తహ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సప్తహ కార్యక్రమం ఈ నెల 5 నుండి ప్రారంభించి శనివారం ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ బిజెపి పార్టీ నాయకులు కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. సప్తహ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రామరాజు యూత్ సభ్యులకు, పోచారం కాలనీవాసులకు, దాతలకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు హరిక్రిష్ణ, మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, మాజీ సర్పంచ్ స్వరూప గంగాధర్, రామరాజు యూత్ సభ్యులు అశోక్, దత్తు, మారుతి, గంగాధర్, సంతోష్, రాజు, దశరథ్, శ్రీనివాస్ వన్నె భీమ్రావు, ముత్యం రాజు, వినోద్ లక్ష్మణ్ పోశెట్టి, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

- **సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అత్యంత కీలకం.**
- **ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం.**
- **విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి.**
- **తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**

**తాండూరు, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, లక్ష్యసాధన పట్ల పట్టుదల వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బీఎంఆర్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్స్‌లో తాండూరు నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మాన పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ప్రభావం చూపే వ్యక్తి ఉపాధ్యాయుడేనని అన్నారు. ఉపాధ్యాయులు చూపించే మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో గురువులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య ఎంతో అవసరమని, ఆ విద్యను అందించే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రతి ఒక్కరూ తమ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని స్వీకరించడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింత అంకితభావంతో పనిచేసి తాండూరు నియోజకవర్గానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే నూతనంగా ఏర్పడిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు ఎమ్మెల్యే బీఎంఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు, పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు, విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థుల అవసరాలపై సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే బీఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, విద్యాశాఖకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**వలిగొండ సెప్టెంబరు 12(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు రామన్నపేట సిఐ ఆధ్వర్యంలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామన్నపేట సీఐ మొలుగూరి రవి, వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మండల ప్రజలందరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని డీజే లకు ఎలాంటి అనుమతులు లేవని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.



# శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి

- **గణేష్ నిమర్జనం లో అప్రమత్తంగా ఉండాలి.**
- **గణేష్ మండపం శాంతియుత నియమ నిబంధనలు పాటించాలి.**

**నిజామాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో సాలూర మండలంలోని టిటిడి కళ్యాణ మండలంలోని శనివారం నాడు గణేష్ ఉత్సవాల సందర్భంలోని గణేష్ మండప నిర్వాహకులకు ప్రజాప్రతినిధులకు సంబంధిత అధికారులు పోలీసు లో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం రాబోయే వినాయక చవితి ఉత్సవాలతో ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించవలసిందిగా నిమర్జనం ఏర్పాటు సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంలో ఎసిపి శ్రీనివాస్ బోధన్ రూలర్ సీఐ విజయబాబు రూలర్ ఎస్సై రాజశేఖర్ బోధన్ తాసిల్దార్ అజామత్ నవాజ్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా నిర్వహించాలని బంజర నది పరిశ్రమల ప్రాంతాలలో లైటింగ్లు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. గజ ఈతగార్లకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో గణేష్ మండలి నిర్వాహకులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప భక్తి ప్రచారానికి శ్రీకారం

- **దేశవ్యాప్తంగా అయ్యప్ప దీక్ష విశిష్టతను చాటేందుకు కార్యాచరణ.**
- **భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యం.**

**తాండూరు సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** అయ్యప్ప స్వామి భక్తి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, ఆలయ సంఘాల ప్రతినిధులు సమాలోచనలు నిర్వహించారు. అయ్యప్ప దీక్ష ప్రాముఖ్యత, ఆధ్యాత్మికత, నియమ నిష్ఠలపై భక్తుల్లో అవగాహన కల్పించడంతో పాటు స్వామివారి సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయ్యప్ప దీక్ష ద్వారా భక్తుల్లో భక్తి, క్రమశిక్షణ, సేవాభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. దీక్షా కాలంలో భక్తులు పాటించాల్సిన నియమాలు, ఆలయ సంప్రదాయాలు, స్వామివారి ఆరాధన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపకులు రాజ్ దేశ్ పాండేతో పాటు అయ్యప్ప ఆలయ సంఘం ప్రతినిధులు గాజుల బసవరాజ్, మనోజ్ గౌడ్, జైపాల్ రెడ్డి, కొంపల్లి రమేష్, నరహరి, నవీన్ కుమార్, భీమ్ చారి, హన్మయ్య, ఆనంద్ గౌడ్, అనంతయ్య గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి భక్తి ప్రచార కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతంగా నిర్వహించి, భక్తులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని ప్రతినిధులు పేర్కొన్నారు.



# వినాయక నిమజ్జనంలో డీజేల మోత మోగిస్తే కఠిన చర్యలు

- **సీఐ మల్లికార్జున్ రెడ్డి**
- **డీజేలకు అనుమతి లేదు**
- **ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**



**మొయినాబాద్, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** వినాయక చవితి నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మొయినాబాద్ సీఐ వై. మల్లికార్జున్ రెడ్డి స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే నిర్వాహకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమంలో డీజేల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని, పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయరాదని తేల్చిచెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వాహకులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగించే విధంగా రికార్డు స్థాయి శబ్దంతో లౌడ్‌స్పీకర్లు వాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసుల సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని, నిబంధనలను అతిక్రమించి చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారైనా సరే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని సీఐ మల్లికార్జున్ రెడ్డి హెచ్చరించారు. పండుగ సంబరాలు ప్రశాంతంగా ముగిసేందుకు నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# ఆత్మకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

**ఆత్మకూరు సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):** దళితుల ఆత్మగౌరవం పై డబ్బుల మూత ఆత్మకూరు పట్టణంలోని శనివారం దళితుల ఆత్మగౌరవంపై కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో డబ్బుల మోత కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ దళితులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టం కరమని అవమాన వ్యాఖ్యలు చేయడం హేనమైన చర్య తీసుకోవాలని పేర్కొన్నారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాతృమూర్తిని దూషించిన తీరును నిరసిస్తూ దళితుల ఆత్మగౌరవంపై దెబ్బ తీశారని దళితులు నడిచిన నేలను శుద్ధి చేశారని ఆరోపణలపై బిఆర్ఎస్ నాయకులు ప్రవర్తించిన తీరుకు నిరసనగా శనివారం ఆత్మకూరు మండలం గాంధీ చౌరస్తాలో నిరసన తెలియచేసారు. దళిత సామాజిక వర్గానికి చెందిన నిరసన కార్యక్రమానికి ఆత్మకూరు మున్సిపల్ పాలకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరు కాకపోవడంతో పలు విమర్శలు వెలుగుతున్నాయి.



# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

**నంద్యాల సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంత రాష్ట్ర దొంగను అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 93 దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఆర్. సుష్మిత, ఐపీఎస్ పర్యవేక్షణలో నంద్యాల త్రీ టౌన్ సీఐ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. గత నెల 20.08.2026న ముకుంద కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని ఐఫోన్ రూ.67,000 నగదు, టీవీఎస్ పెప్ స్కూటీ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. 11.09.2026 రాత్రి 9 గంటల సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలోని పార్కింగ్ ప్రదేశంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.35,000 నగదు, టీవీఎస్ పెప్ స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఉన్న ఇతర కేసులపై కూడా పోలీసులు విచారణ చేపడుతున్నారు. కేసును ఛేదించిన నంద్యాల త్రీటౌన్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ, ఏఎస్పీలు అభినందించారు.



## జల్ పల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా యంజాల దేవేందర్

**మహేశ్వరం సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం కేంద్రంలోని జల్ పల్లి గ్రామంలో.... మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీల పునర్నిర్మాణం లో భాగంగా ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల అధ్యక్షులు చింతల చిన్న ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల్ అధికార ప్రతినిధి యంజల శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా యాంజాల దేవేందర్ అధికార ప్రతినిధిగా యంజల కుమార్ ప్రధాన కార్యదర్శిగా యంజల రోహిత్ ప్రధాన కార్యదర్శి 2 గగన్ పాడు ఉదయ్ ఉపాధ్యక్షులుగా 1 బాలకృష్ణ, 2 వై సాయికుమార్, 3 వై వినోద్ కుమార్, కోశాధికారి డి గణేష్,కార్యదర్శులుగా విగ్నేష్, ప్రవీణ్, శ్రీనాథ్, అన్వేష్, సహాయ కార్యదర్శులుగా శ్రీనాథ్, బి నరసింహ, హర్షవర్ధన్, వెంకటేష్, శ్రీకాంత్, కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు జిఆర్ దానయ్య, సీనియర్ నాయకులు వై. యాదగిరి, రామారావు, నరసింహ, సత్యం, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు



## మాకు రోడ్డు కావాల్సిందే.. మోకాళ్లపై కూర్చుని వాడి గ్రామస్థుల గర్జన!

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాక్షేత్రం):**

భైంసా ఎన్నికల ముందు ఓట్ల కోసం వచ్చి అడ్డగోలు హామీలు గుప్పించే నాయకులు, గెలిచిన తర్వాత కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని నిర్మల్ జిల్లా భైంసా మండలం వాడి గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక దశాబ్దాలుగా నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన చెందుతూ శనివారం వారు రోడ్డుపైనే మోకాళ్లపై కూర్చుని వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మాకు రోడ్డు కావాలి అంటూ గగనతలాన్ని తాకేలా నినాదాలు చేస్తూ అధికారులకు, పాలకులకు తమ గోడును వినిపించారు.

**అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి!**

ఈ సందర్భంగా గ్రామ నివాసులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా తమ గ్రామానికి కనీసం నడవడానికి అనువైన రోడ్డు కూడా లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. వర్షాకాలం వస్తే వాడి గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఒక లంక గ్రామంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో 108 అంబులెన్స్ పిలిచినా గుంతలమయమైన రహదారి కారణంగా వాహనం గ్రామానికి రాలేకపోతోందని ఆరోపించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులను ఆసుపత్రికి తరలించాలంటే కిలోమీటర్ల మేర మోసుకుంటూ వెళ్లాల్సిన దయనీయ స్థితి నెలకొందని కన్నీటిపర్యంతమయ్యారు.

**ఓట్లప్పుడే గుర్తొస్తామా?**

ఎన్నికల సమయం రాగానే గ్రామాల్లో పర్యటించే రాజకీయ నాయకులు.. సిసి రోడ్లు, బీటీ రోడ్లు వేయిస్తామని రంగుల హామీలు ఇస్తారని, తీరా గెలిచిన తర్వాత మొహం చాటేస్తున్నారని గ్రామస్థులు ధ్వజమెత్తారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన రోడ్డును మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని గ్రామ పెద్దలు, యువకులు హెచ్చరించారు.



# అధికారులు రాకపోతే.. సర్వసభ్య సమావేశం ఎందుకు?.

- **మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా ..!**
- **అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు**
- **మహిళా సర్పంచులను అధికారులు లెక్క చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు**
- **రసాభాసగా పోతంగల్ మండల సర్వసభ్య సమావేశం.**

**పోతంగల్, సెప్టెంబరు 12(ప్రజాక్షేత్రం):**

మండల సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై పోతంగల్ మండల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం గురించి వారం రోజుల ముందే సమాచారం ఇచ్చినా అధికారులు హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరేందుకు సమావేశానికి వస్తే... అధికారులు లేకపోతే తమ సమస్యలను ఎవరికి చెప్పాలని మండల ప్రత్యేక అధికారిని ప్రశ్నించారు. సర్పంచుల ఆగ్రహంతో మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మండలకేంద్రంలో శుక్రవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి బాలు హాజరయ్యారు. సమావేశంలో పలువురు సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను ప్రస్తావించారు. పోతంగల్ సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో మహిళా సర్పంచులను అధికారులు లెక్కచేయడం లేదని మహిళా సర్పంచులు సూచించిన వారిలో ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇచ్చిన లిస్టులో లబ్ధిదారులు లేరా అని ఎంపిడిఓను ప్రశ్నించారు. దీంతో ఇతర గ్రామాల సర్పంచులు కల్పించుకుని సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా సరే సూచించిన లిస్టులో నిజమైన లబ్ధిదారులు ఉంటే వారికి ఇండ్లు కేటాయించాలని వారిపై వివక్ష చూపించాల్సిన అవసరం లేదని ఎంపీడీవోకు తెలిపారు. కల్లూరు సర్పంచ్ రామిరెడ్డి మాట్లాడుతూ... అక్రమ ఇసుక రవాణాతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని రవాణాపై పోలీసు అధికారులకు సమాచారం ఇస్తే.. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి సమాచారం చేరవేస్తున్నారంటూ ఆరోపించారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులే వారికి సమాచారం లీక్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని అధికారులను కోరారు. అంగన్వాడి కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని చేతన్ నగర్ సర్పంచ్ కోరారు. తమ గ్రామంలో అంగన్వాడీ టీచర్, ఆయా సరిగ్గా పనిచేయడం లేదని ఆమె అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని హంగర్గా సర్పంచ్ ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఒకే లైసెన్స్ తో గ్రామాల్లో నాలుగు ఐదు కల్లుబట్టీలు నడుపుతున్నారని సుంకిని సర్పంచ్ అధికారులకు తెలిపారు. ప్రజలతో



ఎక్కువగా మమేకమై ఉండే రెవిన్యూ, పోలీసు, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు సమావేశానికి రాకపోతే ఎలా అని షాజీ పటేల్ ప్రశ్నించారు. అధికారులు లేకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు లేకపోతే సర్వసభ్య సమావేశం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. గ్రామాల్లో కరెంటు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని రాత్రి వేళ కరెంటు పోకుండా చూడాలని కల్లూరు సర్పంచ్ రామిరెడ్డి అధికారులను కోరారు. సర్పంచులకు సెక్రటరీలు సహకరించడం లేదని బిల్లుల విషయంలో సతాయిస్తున్నారని అధికారులకు సర్పంచులు విన్నవించారు. రైతు వేదికలో సమావేశం నిర్వహించినప్పుడు వ్యవసాయ శాఖ అధికారి సమావేశంలో లేకపోవడం ఏంటని సర్పంచులు ప్రశ్నించారు. ఇతర ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వచ్చేసారి నిర్వహించే సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బాలు మాట్లాడుతూ... అధికారులు సర్పంచులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే కలిసి మాట్లాడుకుని పరిష్కారం దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఒకవేళ గ్రామంలోని అంగన్వాడి టీచర్లు, హెల్త్ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు సరిగ్గా పని చేయకపోతే ఆయా శాఖల ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చందర్, మండల సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్ ను అవమానించడం దారుణం కెఎల్ఆర్

**మహేశ్వరం సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

బిఆర్ఎస్ పార్టీ దళితులపై చేస్తున్న అఘాయిత్యాలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం కు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ముఖ్య అతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత మళ్లీ అధికారంలోకి ఏలా రావాలి. అని చెప్పి ఒక పాసిస్ట్...ఈ కేసీఆర్ కుట్రలు చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డైరెక్షన్ లో దళితుల మీద అనుచితంగా మాట్లాడటం అనేది సమంజసం కాదు దీని కాంగ్రెస్ పార్టీ అన్ని చోట్ల కూడా వ్యతిరేకిస్తా ఉన్నాం. మొన్నటికి మొన్న ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బీజేపీ చేసిన విదంగా... ఇక్కడ బీఆర్ఎస్ చేసిందని గుర్తు చేశారు. ఈ దేశంలో ఉన్నటువంటి విద్యార్థులు నీట్ పేపర్ లీక్ పైన మరి ర్యాలీ తీసే అక్కడ సభ పెడితే ఆ సభ అయిపోయిన తర్వాత శుద్ధికరణ... సంప్రోక్షణ చేసినటువంటి బిజెపి పార్టీ బిజెపి ప్రభుత్వం ఏ రకంగా చేసిందో అదే రకంగా చేస్తుందన్నారు. దళితుల పై అనుచ్చిత వ్యాఖ్యలు మంచిది కాదు సమాజంలో ఇది మంచి పద్ధతి కాదు మరి ఒకవైపు రాకెట్ చంద్రమండలం మీద మనం కాలు పెడుతున్నాం.. ఇక్కడ ఇంకా మనమే కులాల కుంపటి పెట్టుకొని... మతాల కుంపటి పెట్టుకొని... మాట్లాడటం సరి కాదన్నారు. ఫామ్ హౌస్ దగ్గర కివెళితే నెక్స్ట్ డేనే పాలు... పసుపు తో శుద్ధికరణ చేయడం దారుమాన్నారు.ఈ రాకెట్ యుగంలో జపాన్... చైనా... సౌత్ కొరియా, జర్మనీ దేశాలు పరిగెడతా ఉంటే మీరు చేస్తున్నదేమిటాని ప్రశ్నించారు. ఈ అంటరానితనాన్ని పెంపొందించడం.... చాలా దురదృష్టకరం కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని ప్రాంతాలు, అన్ని భాషలు, అన్ని జాతులు, భారతదేశ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే హక్కు లేదన్నారు. ఆ తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టింది ఎవరు మీరా కుమారి స్పీకర్ గా ఉన్నారు. ఆమె దళితరాలు మరి ఆమె ప్రవేశ పెట్టిన తెలంగాణ రాష్ట్రానికి సీఎం ఎలా అయ్యావని కేసీఆర్ ను ఎమ్మెల్యే వంశీ కృష్ణ ప్రశ్నించారు. మొన్న బీజేపీ ఇవాళ బీఆర్ఎస్ కూడా మనువాదం మనస్ఫూర్తిగా శ్రీకారం చుట్టిందన్నారు. రెండు పార్టీ లు దొందు దొందే అన్నారు.

**మీ భూదందాలు బయటికి తీయడానికే 22ఏ కేఎల్ఆర్**

మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను అవమానించడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా కొత్త పట్నం విషయంలో ముందుకు కదలాలన్నారు. కొత్త పట్నం కు శ్రీకారం చుడితే మహేశ్వరం ప్రజలు బాగుపడుతారని స్థానిక ఎమ్మెల్యే కు భయం పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు డిపాజిట్ లు కూడా దక్కాయన్నారు. దళితులు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ ముందు ఆందోళన చేస్తే ఆ పార్టీ నేతలు పసుపు నీళ్లు చల్లారంటే ఎంత ఘోరంగా ఆలోచించిస్తున్నారని మండి పడ్డారు. దొంగ ఓట్లతో గెలిసిన ఇక్కడ ఎమ్మెల్యే ఏం మాట్లాడుతున్నారో.. ఆమెకు అర్థం కావడం లేదన్నారు. అప్పుడు పార్మా ఎందుకు వదన్నారు. ఇపుడు ఎందుకు కావాలంటున్నారు. మళ్ళీ కొత్త డ్రామాలకు తెరలెప్పారని, ఇక్కడ ఎవరైనా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మీ బీఆర్ఎస్ నేతల యువకులు ఉంటే కూడా ఎఫ్ సీడీఏకి దరఖాస్తు చేసుకొని పరిశ్రమలు నెలకొల్పాలని సబితా రెడ్డి కి సూచించారు.



కేటీ ఆర్, హరీష్ రావు, మీలాంటి పెద్ద నేతలు వ్యాపారం చేసుకుంటా అంటే మేము స్వాగతిస్తామన్నారు. మహేశ్వరం మండలం ను ఫ్యూచర్ సిటీలో కలిపేందుకు తీర్మానాలు ఇవ్వాలని సర్పంచ్లను కోరితే ఇక్కడున్న ఎమ్మెల్యే సబితారెడ్డి సర్పంచ్ సంతకాలు పెట్టకుండా అడ్డుకుంటుందని మండిపడ్డారు. హైటెక్ సిటీ ఏర్పాటు చేసినప్పుడు కూడా ఇలానే అన్నారని.. ఇప్పుడు హైటెక్ సిటీ ఎక్కడ వరకు విస్తరించిందో మనం అందరం చూస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ కొత్తపట్నం రాకతో ఇక్కడ అనేక పరిశ్రమలు ఏర్పాటుతోపాటు స్థానికులకు ఉపాధి ఉద్యోగ అవకాశాల్లో పుష్కలంగా లభిస్తాయన్నారు. ఇక్కడే పుట్టి ఇక్కడ చదువుకొని ఇక్కడే ఉద్యోగం చేసే విధంగా ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లు జరగబోతున్నాయని కేఎల్ఆర్ వెల్లడించారు. 22ఏ తెచ్చిందే బీఆర్ఎస్ నేతల కోసం చేసిన్నాం... మీ భూ కుంభకోణాలను బయటకు తీసేందుకే 22ఏ తెచ్చమ్మన్నారు. పట్ట భూములు, అసైన్డ్ భూములు, దేవాలయ భూములు, వక్ఫ్ బోర్డ్ భూములను ఈ నేతలే చెరబట్టారని వారి అక్రమ దందా బయటకు వస్తుందని భయం తో మొన్నటికీ మొన్న కేటీఆర్ కొత్త డ్రామా కు తెరలేపారన్నారు. రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి మాట్లాడుతూ..స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వాఖ్యలు చేయడం దారుణమన్నారు. మీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం చేశారాని గుర్తు చేశారు. ఇది ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందన్నారు. కాంగ్రెస్ ఆలోచన విధానాలు ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సబితమ్మ కు రాజకీయ బిక్ష పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. సబితా రాబోయే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అసెంబ్లీ గేట్ ముందు చేసిన హంగామా ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ జడ్పీ చైర్మన్ తీగల అనితా రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఆందోళన అనంతరం శ్రీశైలం హైదరాబాద్ హైవే పై ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను నేతలు దహనం చేశారు.

## యధావిధిగా కోకట్ కాగ్నావాగులో గణేష్ ల నిమజ్జనం.

- **తాండూరు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు.**
- **సర్పంచ్ రాజేందర్ రెడ్డి, గ్రామ యువకులు, సమక్షంలో కుదిరిన సయోధ్య.**

**యాలాల సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం)**

వినాయక చవితి వేడుకల్లో అత్యంత కీలకమైన విగ్రహాల నిమజ్జనానికి ఎదురైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. ప్రతి ఏటా నిర్వహించే విధంగానే ఈ సారి కూడా యాలల మండలం కొకట్ కాగ్న వాగులోనే గణేష్ విసర్జన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టనున్నట్లు తాండూరు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు వెల్లడించారు. రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాగులో కలపడం వల్ల నీరు తీవ్రంగా కలుషితమవుతోందని, నిమజ్జనం పూర్తయిన తర్వాత వాగు శుభ్రతను పూర్తిగా విస్మరిస్తున్నారని కొకట్ గ్రామ పెద్దలు గత కొన్ని రోజులుగా నిమజ్జనానికి అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తాండూరు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు కొకట్ గ్రామ పెద్దలు, యువకులతో సమగ్రంగా చర్చించారు. గ్రామస్థులు లేవనెత్తిన అంశాలపై స్పందించిన సమితి నాయకులు, నిమజ్జన ప్రక్రియ ముగిసిన వెంటనే వాగు శుభ్రతా కార్యక్రమాలు, ఇతర తదుపరి పనులన్నింటికీ పూర్తి బాధ్యత వహిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. సమితి ఇచ్చిన హామీతో సంతృప్తి చెందిన గ్రామ పెద్దలు నిమజ్జనానికి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హిందూ ఉత్సవ సమితి ధన్యవాదాలు తెలిపింది. ఈ సమావేశంలో తాండూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బిర్కెట్ రఘు,మాజీ సర్పంచ్ భాజరప్ప, శంకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోతిరెడ్డిపాడు గెట్ రోప్ ఘటనపై సమగ్ర విచారణ జరిపాలి:సిపిఐ

**నంద్యాల సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఘటన.. గేటు భద్రత కంటే కాంట్రాక్టు పనులు వైపే అధికారుల ముగ్గు.. సంబంధిత అధికారుల పై ఈఎన్సి కి పిర్యాదు చేస్తాం.. తాత్కాలిక పనులు కాకుండా 10గేట్ల రోఫ్ లకు శాశ్వత పనులు చేపట్టాలి. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ బాబు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతానికి త్రాగు, సాగునీరు అందించే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ప్రమాద ఘటనపై రాష్ట్ర ఇంజనీర్ చీఫ్ సమగ్ర విచారణ జరిపించాలని, గేట్ల పరిరక్షణ కంటే కాంట్రాక్టర్లు చేసే పనులపైనే అధికారులు ముగ్గు చూపుతున్నారని, అసలు గేట్లు ఎత్తే చోట అధికారులు ఎందుకు లేరని, అవగాహన లేని వారితో గేట్లు ఎత్తడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో 10వ గేటు ఇప్పుడు 9వ గేటు రోఫ్ తెగిపోతే తాత్కాలిక ఉపశమనం కోసం నిధులు కేటాయిస్తున్నారు తప్ప 20 సంవత్సరాల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ మరమ్మత్తులకు శాశ్వత పనులకై నిధులు ఎందుకు కేటాయించడం లేదని అన్ని గెట్ రోఫ్ ల కొత్త వాటికై నిధులు విడుదల చేయాలని అధికారుల నిర్లక్ష్యం, 10 నూతన గేట్ల రోఫ్ లకై ఈఎన్సి, నీటిపారుదల శాఖ మంత్రి ద్రుష్టి పెట్టాలని ఈ విషయంపై సమగ్ర విచారణ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ ఆధ్వర్యంలో తెగిపోయిన గేటును పరిశీలించారు.





## కష్టమొచ్చినా.. కన్నీళ్లొచ్చినా..
# ఊరంతా ఒక్కటే!

- కష్టాల్లోనూ తోడుగా నిలిచిన గ్రామస్తులు
- బాలుడి కుటుంబానికి రూ.12 వేల ఆర్థిక సాయం
- ప్రతి గ్రామానికి ఆదర్శంగా గుట్ట లక్ష్మీపురం ఐక్యత

**బూర్గంపాడు, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

కష్టమొచ్చినా.. కన్నీరు వచ్చినా.. తమ గ్రామంలో ఏ కుటుంబమూ ఒంటరిగా ఉండకూడదనే మానవతా భావంతో గుట్ట లక్ష్మీపురం గ్రామస్తులు ఐక్యతను చాటుతున్నారు. శుభకార్యాల్లో కలిసి ఆనందాన్ని పంచుకోవడమే కాదు.. ఆపద సమయంలోనూ ఒకరికొకరు అండగా నిలుస్తూ 'మన గ్రామం.. మన కుటుంబం' అనే భావనకు నిజమైన అర్థం చెబుతున్నారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ శివారు గుట్ట లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఉకం రాజు, సరిత దంపతుల ఏకైక కుమారుడు భరత్ కుమార్ (14) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందాడు. కామెర్లు, నిమ్ము తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలుడు మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఏకైక కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు గ్రామస్తులను కలచివేశాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబానికి ఆర్థికంగా కొంతైనా భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి ఒక్కొక్కరి నుంచి రూ.100 చొప్పున చందాలు సేకరించారు. ఇలా సేకరించిన మొత్తంతో రూ.12 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఆర్థిక సహాయంతోనే తమ బాధ్యత ముగిసిందని భావించకుండా దహన సంస్కారాల్లోనూ గ్రామస్తులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ..ఈ కష్ట సమయంలో తాము అండగా ఉన్నామంటూ భరోసా కల్పించారు. విషాదంలో ఉన్న కుటుంబానికి గ్రామమంతా ఒకటై నిలవడం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంది.

**కష్టాల్లో తోడుగా నిలవడం ఆనవాయితీ**

గుట్ట లక్ష్మీపురం గ్రామంలో ఈ ఐక్యత ఒక్కరోజుతో ఏర్పడింది కాదు. గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు ఆ కుటుంబాన్ని ఒంటరిగా వదిలేయకుండా గ్రామస్తులంతా కలిసి తమకు చేతనైన సహాయం అందించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆర్థికంగా చేయూత ఇవ్వడంతో పాటు అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. సంతోషం వచ్చినప్పుడు కలిసి పంచుకోవడం ఎంత ముఖ్యమో.. బాధ వచ్చినప్పుడు పక్కన నిలబడటం అంతకంటే ముఖ్యమనే విషయాన్ని గుట్ట లక్ష్మీపురం గ్రామస్తులు తమ చేతల ద్వారా నిరూపిస్తున్నారు.

**'మన గ్రామం..**
**మన కుటుంబం' అనే స్ఫూర్తి**

ప్రస్తుత కాలంలో మనుషుల మధ్య పరస్పర సహకారం, ఆప్యాయతలు తగ్గుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్న సమయంలో గుట్ట లక్ష్మీపురం గ్రామస్తులు చూపుతున్న ఐక్యత ఆదర్శంగా నిలుస్తోంది.కులం, వర్గం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆపదలో ఉన్న కుటుంబానికి 'మేమున్నాం' అంటూ భరోసా ఇవ్వడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం.. కన్నీటిలో భాగస్వాములు కావడం.. చేతనైనంత సహాయం చేయడం.. వంటి విలువలు ప్రతి గ్రామంలోనూ పెంపొందాలని, గుట్ట లక్ష్మీపురం చూపిస్తున్న ఐక్యతా స్ఫూర్తి అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## పత్తికుంట చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ పరిధిలోని పత్తికుంట చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన కోసం ఆయన వెంట జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. నిమజ్జనం సాఫీగా జరిగేలా చెరువు వద్ద ఏర్పాట్లు విద్యుత్ దీపాలు (లైటింగ్),బారికేడ్ల సదుపాయాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బల్దియా, పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భారీ సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున,ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన భద్రతా చర్యలు, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ శాఖల సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కబడ్డీ విజేతలుగా గాయత్రి స్కూల్ విద్యార్థులు

**వలిగొండ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ లో మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా మూశాయి. అండర్ 17 కబడ్డీలో గాయత్రి స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారిని గాయత్రి యజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక మానసిక క్రమశిక్షణ నేర్పిస్తుందని అన్నారు. విజేతలను ముక్కామల విగ్నేష్, గూడూరు జస్వంత్ రెడ్డి, గరిసే మణిశంకర్, గర్దాస్ నితీష్, పొన్నాల తరుణ్ రెడ్డి, దోమల శివకుమార్, రాపోలు సాత్విక్, మార్క ప్రేమ్ కుమార్, ఎండి సోహెల్, కంకల అఖిల్ కుమార్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతం బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేష్, భీమిడి కవిత, జక్క నవీన్ రెడ్డి, పాల్గొన్నారు.




# జోరుగా అక్రమ ఇసుక రవాణా..!

- కింది స్థాయి అధికారుల అండతో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక దందా..?
- ప్రజలు చేసిన ఫిర్యాదులు మాఫియాకు లీక్ చేస్తున్న కానిస్టేబుళ్లు..?
- మండల సర్వసభ్య సమావేశంలో బహిర్గతం చేసిన ఓ సర్పంచ్.
- అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతున్న ప్రజలు






**కోటగిరి,సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలంలో గల మంజీరా నది పరివాహక ప్రాంత గ్రామాల నుండి రాత్రింబవళ్లు అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. మంజీరా నది పరివాహక గ్రామాలైన సుంకిని, పోతంగల్, కొడిచర్ల, హంగర్ గా, కారేగాం గ్రామాల నుండి నిత్యం ఒక్కో గ్రామం నుండి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా యదేచ్చగా కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను నియంత్రించేందుకు ప్రభుత్వం, జిల్లా పోలీస్ బాస్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానిక అధికారుల లోపాయ కారి ఒప్పందాలతో అక్రమ ఇసుక రవాణా మాత్రం ఆగటం లేదు. పెట్రోలింగ్ పోలీసులు సైతం అక్రమ ఇసుక రవాణాకు అండగా ఉంటున్నట్లు స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పోలీసుల సహకారంతోనే అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. ఏకంగా పెట్రోలింగ్ వాహనాల పక్కనుండి ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా పోలీసులు ఏమీ అనడం లేదంటే స్థానిక పోలీసుల తీరు ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తమ గ్రామం నుండి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని ఆయా గ్రామాల నుండి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ సమయంలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు వెంటనే ఇసుక మాఫియాకు ప్రజలు చేసిన ఫిర్యాదును లీక్ చేస్తుండడంతో పోలీసులకు చిక్కకుండా ఇసుక మాఫియా గాళ్లు తప్పించుకుంటున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. అక్రమ ఇసుక రవాణా సమాచారం అందిన వెంటనే వాటిని పట్టుకు రావాలని పోలీస్ ఆఫీసర్ సూచించగా అక్కడికి వెళ్ళగానే ఆ ఇసుక ట్రాక్టర్లు తప్పించుకుపోవడం పై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారం స్థానిక ఎస్ఐకి సైతం తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. ఓవైపు సిబ్బంది కొరత మరోవైపు సమాచారం లీక్ అవ్వటం తో స్థానిక ఎస్ఐకి అంతుచిక్కడం లేదని అయినా ఆయన కఠినంగా వ్యవహరిస్తూ అప్పుడప్పుడు నేరుగా వెళ్లి ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్ కు తరలించి కేసులు చేస్తున్నా కిందిస్థాయి పోలీసు అధికారుల సహకారంతో అక్రమ ఇష్టమాఫియా మాత్రం ఆగడంలేదనిప్రజలు చర్చించుకుంటున్నారు. తమ గ్రామం నుండి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతుండడం వల్ల రోడ్లు పాడవుతున్నాయని ప్రజలకు ఇబ్బందులు అవుతున్నాయని తాము పోలీసులకు సమాచారం ఇస్తే వారు వెంటనే అక్రమ ఇసుక రవాణా చేసే వారికి ఫలానా గ్రామం నుండి సర్పంచ్,ఉప సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫోన్ చేసి ఇసుక నడుస్తున్నట్లు చెబుతున్నారని సమాచారం వెంటనే లీక్ చేస్తున్నారని ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ శుక్రవారం పోతంగల్ మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో బహిరంగంగా చెప్పటం పోలీసుల తీరుకు అద్దం పడుతుంది.

**ఇసుక మాఫియా గాళ్ళతో అధికారుల దోస్తీ...?**

పోతంగల్ మండలంలోని ఆయా గ్రామాల నుండి అక్రమ ఇసుక రవాణా చేసే ఇసుక మాఫియా గళ్ళతో అధికారులు దోస్తీ కడుతున్నారనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా గాళ్ళు ఇచ్చే ఆమ్యామ్యాలకు అలవాటు పడి వారికి కానిస్టేబుళ్లు సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ డ్యూటీలో ఉండే పోలీసులు ఇసుక మాఫియా గాళ్ళతో బహిరంగంగానే చేతులు కలిపినట్లు వ్యవహరిస్తున్నారు. పెట్రోలింగ్ వాహనం పక్కనుండి ఇసుక ట్రాక్టర్లు వెళ్లిన పట్టించుకోకుండా తమకేమీ తెలియదన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తుంది. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు జిల్లా పోలీసు బాస్ ప్రత్యేకంగా చీతా టీం ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నడుస్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు మాత్రం పట్టుబడకపోవడం విశేషం. ఇటీవల రుద్రూర్, వర్ని పోలీస్ స్టేషన్లలో పోతంగల్ మండలం నుండి వెలుతున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టుబడుతున్నప్పటికీ కోటగిరి పోలీస్ స్టేషన్లో మాత్రం ఏమీ జరగనట్లు వ్యవహరిస్తున్న పోలీసుల తీరు పలు అనుమానాలకు తావిస్తుంది. కోటగిరి పోలీస్ స్టేషన్లోని ఓ కానిస్టేబుల్ అక్రమ ఇసుక రవాణా శాసిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కానిస్టేబుల్ డ్యూటీలో ఉంటే అక్రమార్కులకు ఆరోజు పండగే అన్న చందంగా మారింది పోలీసుల తీరు. పోతంగల్ మండలం సుంకిని, కారేగాం హంగర్గా, పోతంగల్, కొడిచర్ల గ్రామాల నుండి నడుస్తున్న ట్రాక్టర్ల సంఖ్యను బట్టి అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటు పోలీసులు అటు రెవెన్యూ అధికారుల అండతో నిత్యం రాత్రింబవళ్లు అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా నిర్వహిస్తూ అక్రమార్కులు జోరుగా డబ్బులు దండుకుంటున్నారు. అక్రమ ఇసుక మాఫియా గాళ్ళకు ఆయా గ్రామాల పరిధిలోని జిపిఓలు సైతం సహకరిస్తున్నట్లు జోరుగా చర్చలు నడుస్తున్నాయి. తహసీల్దార్, రెవిన్యూ అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియలో బిజీగా ఉండడంతో ఇదే అదునుగా భావిస్తున్న అక్రమార్కులు స్థానిక జిపిఓల కనుసన్నల్లో పని చేస్తూ విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గురువారం పోతంగల మండలం కేంద్రం నుండి కొన్ని ట్రాక్టర్లకు తహసిల్దార్ ఇసుక తరలించేందుకు పర్మిషన్ ఇవ్వగా పర్మిషన్ల మాటన ఇచ్చిన దానికంటే రెట్టింపు సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరగడం విశేషం. ఆరోజు ఓ కానిస్టేబుల్ జిపిఓ సైతం విధుల్లో ఉన్నప్పటికీ అక్రమ ఇసుక రవాణా జరగటం పలు అనుమానాలకు తావిస్తుంది. పోతంగల్ మండల కేంద్రంలో మంజీరా నది వద్ద పోలీసు చెక్పోస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ అక్రమ ఇసుక రవాణా ఎలా జరుగుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోతంగల మండలం వైపు మైనింగ్ అధికారులు గానీ, చీతా ఫోర్స్ గాని కన్నెత్తి చూడటం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోవాల్సిన అధికారులే వారితో చేతులు కలిపి అక్రమార్కులకు సహకరిస్తే ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ఎవరిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ దందాలకు సహకరిస్తున్న కింది స్థాయి అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల లాలూచీతనం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని వెంటనే ఉన్నదా అధికారులు అక్రమ ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి పోతంగల్ మండల మండలంలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమ ఇసుకపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.**
**- కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్**

పోతంగల్ మంజీరా నది నుండి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ ను వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణాపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 20 కి పైగా కేసులు చేసినట్లు తెలిపారు. కోటగిరి నుండి తప్పించుకున్న వాళ్లను రుద్రూర్ పోలీస్ స్టేషన్ కు వర్ని పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించి పట్టుకుంటున్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ లు బాగానే పనిచేస్తున్నారని అన్నారు. అక్రమ రవాణా చేసిన సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా గ్రామాల నుండి నడుస్తున్న వాహనాలపై కేసులు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

## బహుజనుల హక్కుల సాధనకు సమరశంఖం.. జి. అనిల్ కుమార్ మౌర్య

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాక్షేత్రం)**

భైంసా బీసీల జనగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలి జగిత్యాలలో జరిగే 13వ తెలంగాణ రాష్ట్ర బామ్‌సెఫ్, ఆర్ఎంఎస్ సమావేశాలను విజయవంతం చేయాలి జి. అనిల్ కుమార్ మౌర్య భైంసా బీసీల జనగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు తగిన వాటా కల్పించాలని బీవీఎం, బీవైఎం, బీబీఎం నిర్మల్ జిల్లా అధ్యక్షులు జి. అనిల్ కుమార్ మౌర్య డిమాండ్ చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న 13వ తెలంగాణ రాష్ట్ర బామ్‌సెఫ్, ఆర్ఎంఎస్ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం భైంసా పట్టణంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా జి. అనిల్ కుమార్ మౌర్య మాట్లాడుతూ.. దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా లెక్కించి, వారి జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**బీసీల జనగణన చేపట్టాలి..**

ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా కల్పించాలి.అనే డిమాండ్‌తో బహుజనుల హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

జగిత్యాలలో జరిగే 13వ తెలంగాణ రాష్ట్ర బామ్‌సెఫ్, ఆర్ఎంఎస్ సమావేశాల్లో సామాజిక న్యాయం, బహుజనుల హక్కులు, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. బహుజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముధోల్ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బహుజన మూలవాసులు, సామాజిక ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు, యువత



పెద్ద సంఖ్యలో సమావేశాలకు హాజరై విజయవంతం చేయాలని జి. అనిల్ కుమార్ మౌర్య కోరారు. బహుజనుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ సమావేశాలను సమష్టి కృషితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయకులు సుంకేట పోశెట్టి, తెలంగాణ ఉద్యమకారుడు కొత్తూరు శంకర్, ఐఎల్‌పీఏ నిర్మల్ జిల్లా నాయకులు, న్యాయవాది అశోక్, అంతర్ని ఉపసర్పంచ్ గురుచరణ్, బీవైఎం నాయకులు వాగ్మారే కపిల్, గంగాధర్, వాగ్మారే సిద్ధు, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, ఎస్టీ సంఘం నాయకులు వసంత్, బంసేఫ్ నాయకులు, బహుజన నాయకులు పాల్గొన్నారు.

## 33 కేవీ ఫీడర్ మెయింటెనెన్స్ పనులు

**పెద్దేముల్, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

33 కేవీ పెద్దేముల్ ఫీడర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆదివారం సెప్టెంబర్ 13వ తేదీ నాడు పెద్దేముల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తాండూరు ఏడీఈ శంకర్ నాయక్ తెలిపారు.33 కేవి ఫీడర్ నిర్వహణ పనులను చేపట్టనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, మెయింటెనెన్స్ పనులకు సహకరించాలని ఆయన కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏడీఈ శంకర్ నాయక్ తెలిపారు.



## సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టం

- సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి

**వలిగొండ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**

సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మేధావి, ఆయన మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శనివారం సిపిఎం వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు ఏచూరి కృషి చేశారని అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, అటవీ హక్కులు, సమాచార హక్కు వంటి చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. విద్యార్థి ఉద్యమం నుంచి జాతీయ రాజకీయాల వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఏచూరి ఆశయాలను కొనసాగిస్తూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూర శ్రీనివాస్, దుబ్బ లింగం, గర్దాసు నరసింహ, వేముల లక్ష్మయ్య, కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, ద్యానబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## సోమేశ్వర్ తండాకు రూ.22 లక్షల నిధులు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజా-క్షేత్రం):**

శ్రీ జగదాంబ సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ప్రారంభం కుబీర్ మండలం సోమేశ్వర్ తండాలో శ్రీ జగదాంబ సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి రూ.22 లక్షల నిధులు మంజూరయ్యాయి. దేవాలయ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ప్రారంభం కావడంతో తండావాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంజూరైన టెండర్ ప్రతిని శనివారం తండావాసులకు అందజేశారు. దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్‌రెడ్డి చేసిన కృషి పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియకు మార్గం సుగమం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సోమేశ్వర్ తండాలో శ్రీ జగదాంబ సేవాలాల్ దేవాలయ నిర్మాణం కోసం తండావాసులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.22 లక్షల నిధులు మంజూరు కావడం, టెండర్ ప్రక్రియ ప్రారంభం కావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ నిర్మాణం పూర్తయితే తండావాసులకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దేవాలయం భవిష్యత్తులో తండా ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి దేవాలయాన్ని పూర్తి చేయాలని తండావాసులు ఆకాంక్షించారు. నిధుల మంజూరుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా నాయక్ ఆడే నజం, ఆలయ అధ్యక్షుడు సురేష్ రాథోడ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, నరేందర్, జాదవ్ తుకారాం, దన్ను, రాథోడ్ శ్యామ్, జాదవ్ రామదాస్, జాదవ్ గజానన్, రాథోడ్ నరేందర్, ఆడే రోహిదాస్, రాథోడ్ జయరాం తదితరులు పాల్గొన్నారు.




## వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్

- **రూ.11.75 కోట్ల నిధులు మంజూరు..**
- **జీవో నం.164 జారీ**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవకు ఫలితం**
- **గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ముందడుగు**

**వనపర్తి, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

పెద్దమందడి మండలం వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీజీపీఎస్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల ఏర్పాటుకు రూ.11.75 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో నం.164ను జారీ చేసింది. దీంతో వెల్టూరు, పరిసర గ్రామాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. టీజీపీఎస్ ఏర్పాటుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ స్థాయిలో కృషి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం కీలక ముందడుగుగా ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ వెల్టూరులో ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాల దోహదపడుతుందని పేర్కొన్నారు. టీజీపీఎస్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరికి, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




## రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి

**శంషాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం)**


రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన శనివారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నగరానికి చెందిన సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ (57) షాద్ నగర్ లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన శనివారం ఉదయం ఆయన తన స్కూటీ నంబర్ టీఎస్ 11ఈజెడ్ 0038 పై తన నివాసం నుండి విధులకు షాద్‌నగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు నుండి వచ్చిన గుర్తుతెలియని వాహనం అధిక వేగంతో, అజాగ్రత్తగా మరియు నిర్లక్ష్యంగా నడుపుతూ స్కూటీని ఢీకొవడంతో సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ రోడ్డుపై పడిపోగా, తలకు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సిసి ఫుటేజ్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తామని వివరించారు.



# డప్పు చప్పుడు నుంచి సుప్రీంకోర్టు తీర్పు వరకు!







- **30 ఏళ్ల మాదిగ దండోరా... ఇప్పుడు ఫలితాల పరీక్ష!**
- **ఈదుమూడిలో మొదలైన స్వరం**

1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి—ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించింది. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రారంభమైన ఈ ఉద్యమం ప్రధానంగా ఎస్సీ రిజర్వేషన్లలో అంతర్గత వర్గీకరణ కోసం పోరాటాన్ని ప్రారంభించింది. ఎస్సీలకు ఉన్న రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందుతున్నాయా? వెనుకబడిన ఉపకులాలకు వారి జనాభా, సామాజికవిద్యా పరిస్థితులకు అనుగుణంగా న్యాయమైన వాటా దక్కుతోందా? అనే ప్రశ్నలను ఉద్యమం ప్రజల ముందుంచింది.

**డప్పు చప్పుడు... దండోరాగా మారిన ఉద్యమం**

గ్రామాల్లో దప్పు చప్పుడుతో ప్రజలను సమీకరించిన ఈ ఉద్యమం క్రమంగా "మాదిగ దండోరా"గా విస్తరించింది. ధర్నాలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు, పాదయాత్రలు, రైల్‌రోకోలు, భారీ బహిరంగ సభలు—ఇలా అనేక రూపాల్లో పోరాటం సాగింది. ఒక సామాజిక వర్గం రిజర్వేషన్ సమస్యను మాత్రమే కాకుండా ఆత్మగౌరవం, సామాజిక గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను కూడా ఉద్యమం చర్చలోకి తీసుకొచ్చింది.

**కమిషన్ నుంచి ప్రభుత్వ నిర్ణయం వరకు**

ఉద్యమ ఒత్తిడితో ఎస్సీ ఉపకులాల పరిస్థితిపై ప్రభుత్వ స్థాయిలో అధ్యయనాలు జరిగాయి. జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ఎస్సీ ఉపకులాలను నాలుగు గ్రూపులుగా విభజించే నమూనాను సూచించింది. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎ, బి, సి, డి వర్గీకరణకు ప్రయత్నాలు జరిగాయి. అయితే ఈ విధానం న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంది. దీంతో రాజకీయ నిర్ణయంతో పాటు రాజ్యాంగపరమైన పరిష్కారం కూడా అవసరమైంది.

**న్యాయపోరాటంలో ఎదురుదెబ్బ**

2004లో ఈ.వి చెన్నయ్య కేసు తీర్పు ఎస్సీ ఉపకులాల వర్గీకరణ విషయంలో రాష్ట్రాల అధికారంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఉద్యమానికి ఇది పెద్ద ఎదురుదెబ్బ. అయినా ఎమ్మార్పీఎస్ వెనక్కి తగ్గలేదు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దీక్షలు, ఆందోళనలు, రాజకీయ చర్చలు, న్యాయపోరాటం కొనసాగాయి. ప్రభుత్వం మారినా డిమాండ్ మాత్రం మారలేదు—ఎస్సీ రిజర్వేషన్లలో అంతర్గత న్యాయం కావాలన్నదే.

**మందకృష్ణ మాదిగ... పోరాటానికి ముఖచిత్రం**

మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో మందకృష్ణ మాదిగ పేరు విడదీయలేనిదిగా మారింది. గ్రామస్థాయి కార్యకర్తగా ప్రారంభమైన ఆయన రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎస్సీ వర్గీకరణకు గళం వినిపించిన నాయకుడిగా ఎదిగారు. రాజకీయ పార్టీలతో చర్చలు జరిపినా, ఎన్నికల్లో పోటీ చేసినా, ఆయన ప్రధాన రాజకీయసామాజిక గుర్తింపు మాత్రం వర్గీకరణ ఉద్యమ నాయకుడిగానే కొనసాగింది.

**2023... జాతీయ వేదికపైకి మాదిగ దండోరా**

హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప సభతో ఎస్సీ వర్గీకరణ అంశం జాతీయ రాజకీయ వేదికపై మరింత బలంగా వినిపించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ సభతో దాదాపు మూడు దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమం దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించింది. కేంద్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలనే డిమాండ్ మరింత బలపడింది.

**డప్పు చప్పుడు నుంచి సుప్రీంకోర్టు తీర్పు వరకు!**

**2024 ఆగస్టు 1... చరిత్రను మార్చిన తీర్పు**

2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 6:1 మెజారిటీతో ఎస్సీలలో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అవకాశం ఉందని తీర్పు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ ప్రధానంగా కోరుతున్న డిమాండ్‌కు ఇది అత్యంత కీలకమైన న్యాయపరమైన మలుపు. అయితే సుప్రీంకోర్టు మాదిగలకు నిర్దిష్ట శాతం కేటాయించలేదు. తగిన డేటా, సామాజికవిద్యా వెనుకబాటుతనం, ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాలు వర్గీకరణ చేయవచ్చని మార్గం చూపింది.

**తీర్పు తర్వాత అసలు బాధ్యత**

సుప్రీంకోర్టు తీర్పుతో ఒక తలుపు తెరుచుకుంది. కానీ ఆ తలుపు గుండా నడవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఎవరు ఎంత వెనుకబడ్డారు? ఎవరు ఎంత రిజర్వేషన్ ప్రయోజనం పొందారు? విద్య, ఉద్యోగాల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత? అనే ప్రశ్నలకు గణాంకాలతో సమాధానాలు అవసరమయ్యాయి. దీంతో ఉద్యమం నినాదాల దశ నుంచి డేటా ఆధారిత విధాన చర్చ దశకు చేరింది.

**తెలంగాణలో 1-9-5 నమూనా**

2025లో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ చట్టం తీసుకొచ్చింది. మొత్తం 15 శాతం SC రిజర్వేషన్‌లో గ్రూప్Iకి 1 శాతం, గ్రూప్IIకి 9 శాతం, గ్రూప్IIIకి 5 శాతం కేటాయించే విధానం అమల్లోకి వచ్చింది. మాదిగలు గ్రూప్ IIలో ఉండగా, ఆ గ్రూప్‌కు 9 శాతం అంతర్గత వాటా కేటాయించబడింది. మూడు దశాబ్దాల డిమాండ్‌కు తెలంగాణలో ఇది కీలకమైన చట్టపరమైన ఫలితం.

**చట్టం వచ్చింది... మరి ఫలితం ఎంత?**

ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది. చట్టం రావడం చారిత్రక ఘట్టం కావచ్చు. కానీ పేద విద్యార్థికి విద్యలో సీటు వచ్చిందా? నిరుద్యోగ యువకుడికి ఉద్యోగ అవకాశం పెరిగిందా? గతంలో తక్కువ ప్రాతినిధ్యం ఉన్న ఉపకులాలకు ఇప్పుడు అవకాశాలు పెరిగాయా? బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ అవుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. రిజర్వేషన్ శాతం కాగితంపై కనిపించడం కంటే దాని ఫలితం ప్రజల జీవితాల్లో కనిపించడమే అసలు విజయం.

**30 ఏళ్ల మాదిగ దండోరా...**

**ఇప్పుడు ఫలితాల పరీక్ష!**

**ఉద్యమం గెలిచిందా? కొత్త దశలోకి వెళ్లిందా?**

1994లో డిమాండ్‌గా మొదలైన వర్గీకరణ ప్రశ్న 2024లో సుప్రీంకోర్టు తీర్పుతో రాజ్యాంగపరమైన మార్గం పొందింది. 2025లో తెలంగాణలో చట్టరూపం దాల్చింది. కాబట్టి డిమాండ్ సాధనలో ఎమ్మార్పీఎస్ కీలక దశను దాటిందని చెప్పవచ్చు. కానీ ప్రజల జీవితాల్లో దాని పూర్తి ఫలితాలు ఎంతవరకు కనిపించాయో నిర్ధారించడానికి ఇంకా సమగ్ర గణాంకాల పరిశీలన అవసరం.

**ప్రజలకు అసలు ఏమి వచ్చింది?**

ఎమ్మార్పీఎస్ ఉద్యమం వల్ల ఎస్సీలలోని అంతర్గత అసమానతపై దేశవ్యాప్తంగా చర్చ పెరిగింది. రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికెంత అందుతున్నాయి అనే ప్రశ్న రాజకీయ, పరిపాలనా చర్చలోకి వచ్చింది. తెలంగాణలో 195 వర్గీకరణ అమల్లోకి రావడంతో ఎస్సీ ఉపకులాలకు అంతర్గత వాటా ఏర్పడింది. ముఖ్యంగా విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈ విధానం ఎలా ఫలితాలు ఇస్తుందనేది ఇప్పుడు ప్రజల దృష్టిలో ప్రధాన అంశం.

**వికారాబాద్‌లో ఫలితం ఎక్కడ?**

వికారాబాద్ వంటి జిల్లాల్లో ఈ చట్టం ప్రభావాన్ని గ్రామస్థాయిలో కొలవాల్సిన అవసరం ఉంది. గత పదేళ్లలో ఎస్సీ రిజర్వేషన్ ద్వారా వచ్చిన ఉద్యోగాల్లో ఉపకులాల వారీగా ప్రాతినిధ్యం ఎంత? ఉన్నత విద్యలో పరిస్థితి ఏమిటి? వైద్య, ఇంజినీరింగ్, డిగ్రీ ప్రవేశాల్లో మార్పు ఎంత? పోటీ పరీక్షల్లో అవకాశాలు ఎలా పెరిగాయి? 2025 తర్వాత ఎన్ని కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందాయి? ఈ ప్రశ్నలకు జిల్లా స్థాయి అధికారిక గణాంకాలు లభించినప్పుడే వికారాబాద్‌లో వర్గీకరణ ప్రభావంపై ఖచ్చితమైన తీర్పు చెప్పగలం.

**దండోరా నుంచి డేటా వరకు**

మూడు దశాబ్దాల క్రితం ఉద్యమాన్ని ముందుకు నడిపింది డప్పు తర్వాత ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు ఉద్యమానికి బలమయ్యాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఉద్యమానికి అత్యంత బలమైన ఆయుధం డేటా కావాలి. ఎన్ని సీట్లు? ఎన్ని ఉద్యోగాలు? ఎంత ప్రాతినిధ్యం? ఎంత బ్యాక్‌లాగ్? ఎన్ని కుటుంబాలకు ప్రయోజనం? అనే లెక్కలే ఇక ప్రభుత్వాలను ప్రశ్నించాలి.

**మందకృష్ణ ముందు కొత్త బాధ్యత**

2025లో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ లభించడం ఆయన సామాజిక ఉద్యమానికి జాతీయ స్థాయి గుర్తింపుగా నిలిచింది. అయితే గౌరవం ఒక విషయం, ఉద్యమ లక్ష్యం పూర్తిగా నెరవేరడం మరో విషయం. ఇకపై "వర్గీకరణ కావాలి" అనే డిమాండ్‌తో పాటు "వర్గీకరణ సక్రమంగా అమలవుతోందా?" అనే ప్రశ్నను కూడా ఉద్యమం ముందుకు తీసుకెళ్లాల్సిన దశ వచ్చింది.

**సామాజిక న్యాయానికి కొత్త కొలమానం**

1శాతం, 9 శాతం, 5 శాతం అనేవి కేవలం సంఖ్యలు కావు. వాటి వెనుక విద్యార్థుల భవిష్యత్తు, యువత ఉద్యోగ అవకాశాలు, పేద కుటుంబాల ఆర్థిక స్థితి, తరతరాల వెనుకబాటుతనం ఉన్నాయి. అందుకే ప్రతి సంవత్సరం ఉపకులాల వారీగా విద్య, ఉద్యోగ, ప్రాతినిధ్య గణాంకాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలి. అప్పుడే వర్గీకరణ పారదర్శకతతో ముందుకు సాగుతుంది.

**ముగింపు — పోరాటం**

**ముగియలేదు... రూపం మారింది**

1994లో ఈదుమూడిలో వినిపించిన స్వరం మూడు దశాబ్దాల తర్వాత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వరకు చేరింది. 2024లో న్యాయపరమైన మార్గం తెరుచుకుంది. 2025లో తెలంగాణ చట్టరూపం ఇచ్చింది. ఇప్పుడు 2026లో చరిత్ర అడుగుతున్న ప్రశ్న ఒక్కటే—ఈ చట్టం వల్ల చివరి వరుసలో ఉన్న మనిషి జీవితంలో ఎంత మార్పు వచ్చింది? డప్పు ఉద్యమాన్ని ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఒక తలుపు తెరిచింది. చట్టం ఒక మార్గాన్ని చూపింది. ఇక ఆ మార్గంలో సామాజిక న్యాయం ఎంత దూరం నడిచిందో ప్రజల జీవితాలే చెప్పాలి.

**30 ఏళ్ల మాదిగ దండోరా...**

**ఇప్పుడు నిజమైన ఫలితాల పరీక్ష!**



**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

# సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యం

- **పెద్దేముల్ మండల స్థాయిలో 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**
- **నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**




నేటి విద్యార్థులే రేపటి సమాజాన్ని నడిపించే పౌరులని, అలాంటి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 17 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి శుక్రవారం సాయంత్రం తాండూరు పట్టణంలోని తులసి గార్డెన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.....

**నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని,** విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ, వారి ఉన్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో పనిచేసి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్, పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి మల్లేశం, లొంక నర్సింహులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




## శంషాబాద్ జోనల్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా బైతి శ్రీధర్

- **రాజేంద్రనగర్‌లో జరిగిన సమావేశంలో కమిటీ ఏర్పాటు.**

**శంషాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

భాగ్యనగరి గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యుల పిలుపు మేరకు శనివారం రాజేంద్రనగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శంషాబాద్ జోనల్ గణేష్ ఉత్సవ సమితి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బైతి శ్రీధర్ శంషాబాద్ జోనల్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా నియమించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టలు తీర్చడమే తన లక్ష్యం

- **ఏంఐఏం ప్రధాన కార్యదర్శి ఇలియాజ్.**
- **సొంత ఖర్చులతో వెంకటరమణ కాలనిలో రోడ్డుపై మట్టి పోయించిన నాయకుడు**

**జహీరాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సేవ కార్యక్రమలు, ప్రజల సమస్యలు తీర్చడానికి అహర్నిశలు కృషి చేస్తానని, ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన ఎక్కడ వెనకడుగు వేసేది లేదని ఏంఐఏం జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ ఇలియాజ్ అన్నారు. శనివారం నాడు పట్టణంలో వెంకటరమణ కాలనిలో తన సొంత ఖర్చులతో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తానే స్వయంగా దగ్గరుండి మట్టిని పోయించి గుంతలు మూసివేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీవితంలో గెలుపు ఓటములు ఒక భాగమని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తీర్చడానికి నా వంతు సహాయ సహకారాలు అందించడంతో పాటు సమస్యల పరిష్కరం కోసం కృషి చేస్తానని, 22 వ వార్డులో ఏ సమస్యలు ఉన్న నేరుగా తనని సంప్రదించాలని వార్డు వాసులతో కోరారు. తమ కాలనిలో మట్టిని వేసి సమస్యను పరిష్కరించిన మొహమ్మద్ ఇలియాజ్ కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.







## ఎల్లకొండ గుట్టపై శ్రావణమాసం చివరి శనివారం ఘనంగా వేడుకలు

- **అమ్మ వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామ ప్రజలపై ఉంటాయి**
- **ఎల్లకొండ గ్రామ సర్పంచ్ కావలి కొండల్ యాదవ్.**
- **అమ్మవారి కటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి**
- **ఆలయ ధర్మకర్త పట్లోళ్ల భరత్ రెడ్డి**

**నవాబుపేట్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎల్లకొండ గ్రామంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన పార్వతి పరమేశ్వరుల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని గ్రామ సర్పంచ్ తెలిపారు. శ్రావణమాసంలో ప్రతి సోమవారం పార్వతీ పరమేశ్వరుల పూజలు చేస్తారని శ్రావణమాసంలో చివరి శనివారం సందర్భంగా వెల్లకుండా గ్రామంలోని ప్రజలు నలుమూలల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారు ఆశీస్సులు తీసుకుంటారని తెలిపారు. ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ ఎంతో సుందరమైన వాతావరణంలో ఎల్లకొండ గ్రామంలో శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఆశీర్వాదాలతో గ్రామ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి ఎల్లప్పుడూ రుణపడి గ్రామ ప్రజలు ఉంటారని అదే విధంగా సంతానం లేని వారికి అనేక రోగాల బారిన పడిన వారికి శ్రీ పార్వతీ పరమేశ్వరులు నమ్ముకుంటే అన్ని మంచే జరుగుతాయని ప్రజల నమ్మకం అని తెలిపారు అమ్మవారికి అభిషేకం చేసి కుంభంతో వొక్కులు తీర్చుకుంటారని శ్రీ పార్వతీ పరమేశ్వరుల ప్రాగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరూ పాల్గొని పూజలు అందుకుంటారని తెలిపారు. ఎల్లకొండ గ్రామ ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో ఆనందంగా పార్వతీ పరమేశ్వరుల దీవెనలతో ఉంటారని తెలిపారు. శనివారం రోజు పార్వతి పరమేశ్వర ఆలయంలో లో రోజంతా ఎంతో సందడిగా భజనలతో మారుమోగాయని శనివారం ఉదయం నుండి రాత్రి తెల్లారి సరి వరకు చంద్రమౌళి స్వామి ఆధ్వర్యంలో భజనతో స్వామివారి ఆశీర్వచనాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పి .రాంచందర్, ఆలయ ప్రధాన అర్చకులు, విశ్వనాథం స్వామి, సంతోష్ స్వామి, శశికాంత్ స్వామి,. బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా. అధ్యక్షులు బి.గాలయ్య. బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ వైభవ్ రెడ్డి చేవెళ్ల, అర్చకుల బృందం, పూజారులు, పూర్ణచంద్రస్వామి, ఆనందం స్వామి, విశ్వ స్వామి, శివ స్వామి, కరుణాకర్ స్వామి, సిద్దు స్వామి, శివ శాస్త్రి స్వామి, ఆకాష్ స్వామి, గ్రామ వార్డు మెంబర్లు గ్రామ పలు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఆశీర్వాదాలు ఆశీస్సులు పొందారు.



# ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులు మేల్కొంటారా..?

- **సీతారామ కెనాల్ బ్రిడ్జిపై పొంచి ఉన్న పెను ప్రమాదం**
- **గుంతలు పైకి తేలిన ఇనుప రాడ్లు.**
- **ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి.**
- **పత్రికలో ఎన్నిసార్లు ప్రచురించినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం-అంజనాపురం మధ్య ఉన్న సీతారామ కెనాల్ బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారింది. బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతలు, రోడ్డులో నుంచి పైకి తేలిన ఇనుప రాడ్లు వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ ప్రమాదకర పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి రహదారి అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నిసార్లు ప్రచురించినా స్పందన లేదా..?**

సీతారామ కెనాల్ బ్రిడ్జి దుస్థితిపై మనజ్యోతి రిపోర్టర్ పలుమార్లు పత్రికా రూపంలో వార్తలు ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్రికల్లో వరుసగా కథనాలు వచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు స్పందిస్తారా..? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.

**ప్రాణాలు పోయే వరకు పట్టించుకోరా..?**

ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరంగా మారిన బ్రిడ్జిని పట్టించుకోకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఆలస్యం చేస్తే భారీ ప్రమాదం జరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీతారామ కెనాల్ బ్రిడ్జిని తక్షణమే పరిశీలించి, గుంతలను పూడ్చి, బయటకు వచ్చిన ఇనుప రాడ్లను తొలగించి, రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద హెచ్చరికలు, రాత్రివేళల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు చేసే పరిస్థితి కాకుండా.. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.









## కాక్రావేణీ నదిలో అక్రమ ఇసుక రవాణా.

- **అడ్డుకున్న బీఆర్ఎస్ యాలాల మండల శాఖ.**
- **అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణ.**
- **అడ్డుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సి. రవీందర్ రెడ్డి.**

**యాలాల, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులోని కాక్రావేణీ నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను యాలాల మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాగ్నా నదిలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాక్రావేణీ నది పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల కళ్లముందే ఇసుక తరలింపు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యాలాల్ మండలంలోని కొంతమంది ప్రముఖ నాయకులకు ముడుపులు చెల్లిస్తూ ఇసుక అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని, సంబంధిత అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ వడ్డె రాములు, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం

**హైదరాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

ఈ నెల 8వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవానికి ఓయూ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన భారత్ బయోటిక్ ఫౌండర్ & చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్.కృష్ణ. ఎం.ఎల్లా మరియు ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. కుమార్ మొలుగరం వాళ్ళ చేతుల మీదుగా కొమ్ము శేఖర్ మాదిగ పీహెచ్డీ డాక్టరేట్ పట్టా అందుకోవడం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్; ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకుగాను కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ పట్టా ప్రధానం చేసింది. సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మార్గనిర్దేశకత్వంలో నడుస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో కీలక నాయకుడిగా ఎదిగిన కొమ్ము శేఖర్ ఓయూ అధ్యక్షుడిగా,పలు జిల్లాలకు ఇంచార్జిగా తన సేవలను అందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన తల్లిదండ్రులు కొమ్ము సరోజఅంజయ్య దంపతులకు జన్మించిన శేఖర్ చిన్న వయసులోనే విద్యపట్ల ఆసక్తి పెంచుకొని, ఐదవ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆపై ఎల్.బి.నగర్‌లో పదో తరగతి వరకు,ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి తక్కువ వనరులతోనే ఉన్నత విద్య వైపు అడుగులు వేశారు. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడగా, విద్యార్థి నాయకుడిగా పోరాటాలలో ముందువరుసలో నిలబడి తన కృషితో అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసిన శేఖర్ ఒకవైపు సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే, మరోవైపు ఉన్నతవిద్యలో ప్రగతిని ఆపకుండా పీహెచ్‌డీ ప్రవేశం పొంది పరిశోధనలో ప్రతిభ చాటారు. డాక్టరేట్ డిగ్రీ అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కు అదేవిధంగా పరిశోధన పూర్తిచేయడానికి ఎంతో చొరవ తీసుకొని సహకరించిన తన గురువర్యులు ప్రొఫెసర్ వై. పార్థసారథి తో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని అధ్యాపకులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. చిన్నతనంలో కూలీ పనులు చేస్తూ మరోవైపు సామాజిక న్యాయం,సమానత్వ సాధన కోసం జరిగిన దండోరా ఉద్యమంలో నిబద్ధతతో పనిచేస్తూనే, విద్యను ఆయుధంగా మార్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకున్న కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకవర్గం, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.






## అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

- **పంటలు ఎండిపోకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్.**

**వనపర్తి, సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి, కృష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం ఆందోళనకు దిగారు. సబ్‌స్టేషన్ సమీపంలోని వనపర్తి-పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అయితే సమస్యపై డీఈతో నేరుగా మాట్లాడించాలని రైతులు కోరడంతో ఏఈ ఫోన్ ద్వారా డీఈతో మాట్లాడించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయానికి 13 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అంతరాయాలు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. విద్యుత్ కోతల కారణంగా మోటార్లు నడపలేక పంటలకు సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఏఈ సమక్షంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించిన రైతులు, నమోదైన సరఫరా సమయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాస్తవ సరఫరా సమయానికి, లాగ్‌బుక్‌లో నమోదైన సమయానికి వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. పంటలు దెబ్బతినకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించాలని కోరారు. రైతుల డిమాండ్ వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరారు. అప్రకటిత కోతలను నివారించి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కే. మాణిక్యం, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువరన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్‌రెడ్డి, నాయకులు రవిప్రకాశ్‌రెడ్డి, నారాయణనాయక్, శంకర్‌నాయక్, టీకేనాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్లానాయక్, గోవిందునాయక్, శివ, ఆనంద్, తులసిరామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

- **మంత్రి సీతక్కకు శంషాబాద్ మండల సర్పంచ్ లు ఘన సన్మానం.**

**శంషాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

గ్రామపంచాయతీ 2018 చట్టం సవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కేటీశ్వర్ గౌడ్ సర్పంచులు ప్రభాకర్ గౌడ్, రవి నాయక్, రవీందర్ నాయక్, మౌనిక ఆంజనేయులు, బుజ్జి గోపాల్ నాయక్, బీక్య నాయక్, ఇందిరమ్మ, బిక్షపతి, దేవేందర్, మైలారం సురేఖ రాజు, బాలు ముదిరాజ్, బన్నీ, బిట్టు తదితరులు పాల్గొన్నారు.



# ఏంద్రా మామా... ఏం తిన్నావ్?

- **"ఏం తినలే బావా... పొలంకాడికి పోయి వచ్చేసరికి పొద్దెక్కిపోయింది!"**

పల్లె వీధుల్లో వినిపించే ఆ పలకరింపు... ఒక మనిషి ఆకలిని మాత్రమే కాదు, ఒక కుటుంబం బతుకును, ఒక ఊరి బంధాన్ని, ఒక తరపు జ్ఞాపకాన్ని అడుగుతుంది. తెల్లారకముందే పల్లె మేల్కొంటుంది. కోడి కూయకముందే కొందరి ఇళ్లలో పొయ్యి వెలుగుతుంది. ఇంటి ముందు ముగ్గు పడుతుంది. పశువుల కొట్టం తలుపులు తెరుచుకుంటాయి. ఎద్దుల గంటలు మోగుతాయి. పొలానికి వెళ్లే రైతు భుజాన కండువా వేసుకుంటాడు. కూలీ చేతిలో పనిముట్లు పట్టుకుంటాడు. పిల్లలు పుస్తకాల సంచులు సర్దుకుంటారు. ఆ సమయంలో పల్లె వీధిలో ఒక గొంతు వినిపిస్తుంది— "ఏంద్రా మామా... ఎక్కడికి పోతున్నావ్?" దానికి సమాధానం— "ఏం లేదురా బావా... పొలంకాడికి పోతున్నా." మళ్లీ వెంటనే ప్రశ్న— "ఏం తిన్నావ్?" సమాధానం— "ఏం తినలే." అంతే. ఆ రెండు మాటల మధ్యే పల్లె మనిషి బంధం మొత్తం దాగి ఉంటుంది. "ఏం తిన్నావ్?" అని అడగడం అంటే కేవలం ఆకలి గురించి తెలుసుకోవడం కాదు. "నీ ఆరోగ్యం ఎట్లుంది?", "నీ ఇంట్లో పరిస్థితి ఎట్లుంది?", "నీకు ఏదైనా కష్టం ఉందా?", "నీకు సహాయం కావాలా?" అని అడిగినట్టే. పల్లె భాషలో మాట చిన్నది. కానీ దాని వెనుక ఉన్న మనసు మాత్రం చాలా పెద్దది. రాజా తెల్లవారుజామున ఇంటి గడప దాటగానే ఎదురుగా మామా కనిపించాడు. రాజా: "ఏంద్రా మామా... ఇంత పొద్దున్నే ఎటు పోతున్నావ్?" మామా: "ఏం లేదురా రాజా... పొలంకాడికి పోతున్నా. నిన్న రాత్రి నీళ్లు వదిలినం కదా... పంట ఎట్లుందో చూసొద్దామని." రాజా: "ఒక్కడివే పోతున్నావా?" మామా: "మరి ఎవరు వస్తరురా? నీ అత్తను పిలిస్తే ఇంటి పని అంటది. నిన్ను పిలిస్తే నిద్ర అంటవ్!" రాజా: "హహా... సరే మామా. ముందు ఒకటి చెప్పు." మామా: "ఏమిటది?" రాజా: "ఏం తిన్నావ్?" మామా: "ఏం తింటానురా బావా... ఏం తినలే." రాజా: "అయ్యో మామా! ఖాళీ కడుపుతో పొలానికి పోతావా?" మామా: "ఏం చేస్తాం రా... పని ముందుంది." రాజా: "పని ఎక్కడికీ పోదు. ముందు మా ఇంటికి రా." మామా: "వద్దురా... మీ ఇంట్లో వాళ్లకు ఇబ్బంది." రాజా: "అది ఏం మాట మామా? పల్లెలో ఇంటికి వచ్చిన మనిషిని తినిపించడం ఇబ్బందా? తినకుండా పంపడమే ఇబ్బంది." మామా ఒక్కసారి రాజా ముఖం చూసి నవ్వాడు. మామా: "అదే రా... మీ అమ్మ మాటలు నీలోకి వచ్చాయి." ఇంట్లోకి వెళ్లగానే రాజా గట్టిగా పిలిచాడు. రాజా: "అమ్మా!" అమ్మ: "ఏమయ్యా?" రాజా: "మామ వచ్చిండు. ఏం తినలేదట." అమ్మ: "అయ్యో! రండి మామా... కూసోండి. అన్నం వేడి చేసి పెడతా." మామా: "వద్దమ్మా... అట్లనే పోతా." అమ్మ: "అట్లనే పోతే ఎట్ల? పొలం దున్నేది మీరు... మీ పొట్ట ఖాళీగా ఉంటే పొలం దున్నుతుందా?" మామా నవ్వాడు. మామా: "సరే అమ్మా... పెడితే తింటా." అమ్మ: "అదిగో... అదే మాట." ఇది ఒక ఇంటి సన్నివేశం మాత్రమే కాదు. ఇది ఎన్నో పల్లెల్లో ఇప్పటికీ కనిపించే జీవన పద్ధతి. ఇంటికి వచ్చినవాడిని "ఎందుకొచ్చావ్?" అని అడగక ముందే "తిన్నావా?" అని అడిగే సంస్కృతి. కొద్దిసేపటికి బావా అక్కడికి వచ్చాడు. బావా: "ఏమయ్యా మామా... ఇక్కడే ఉన్నావా?" మామా: "ఉన్నా బావా." బావా: "ఏం తిన్నావ్?" మామా: "ఇప్పుడే తింటున్నా." బావా: "రాజా... నువ్వు?" రాజా: "నేనూ తినలే." బావా: "మరి ఇద్దరూ కలిసి తినండి." అమ్మ: "మీ అందరికీ పెడుతుంటే నా వంటగది పెద్ద హోటల్ అయిపోతుంది!" బావా: "హోటల్ అయితే డబ్బులు తీసుకుంటావమ్మా!" అమ్మ: "మీ దగ్గర డబ్బులు తీసుకోవాలంటే ముందుగా మీ దగ్గర డబ్బులు ఉండాలి కదా!" ఇంట్లో నవ్వులు పూశాయి. పల్లె నవ్వు కూడా ఇలాగే ఉంటుంది. కష్టాల మధ్య పుడుతుంది. అప్పుల మధ్య పుడుతుంది. వాన రాకపోయినా పుడుతుంది. పంట చేతికి రాకపోయినా పుడుతుంది. ఎందుకంటే పల్లె మనిషి జీవితంలో బాధ ఎంత ఉన్నా, దాన్ని మర్చిపోయేంత మమకారం చుట్టూ ఉంటుంది. అంతలో చెల్లి వచ్చింది. చెల్లి: "అమ్మా... లోపల ఉన్నారా?" అమ్మ: "రా చెల్లి." చెల్లి: "మామా కూడా ఉన్నారా?" మామా: "ఉన్నా చెల్లి." చెల్లి: "ఎట్లున్నారు?" మామా: "బాగున్నా. నువ్వెట్లున్నావ్?" చెల్లి: "ఏం ఉంటాం మామా... ఇంటి పని, పిల్లల పని, బయట పని... రోజు ఎట్ల పోతుందో తెల్వదు." రాజా: "పిల్లలు ఎక్కడ?" చెల్లి: "స్కూల్‌కు పంపించా." బావా: "చదువు ఎట్లుంది?" చెల్లి: "బాగానే చేస్తున్నారు. వాళ్లు మనలాగా కష్టపడకూడదు." ఆ మాట దగ్గర అందరూ కాసేపు మౌనంగా ఉన్నారు. ఎంతటి పేదరికం ఉన్నా, పిల్లల భవిష్యత్తుపై పల్లె తల్లిదండ్రుల ఆశ మాత్రం పెద్దదే. చెల్లి: "మనం ఎంత కష్టపడినా పర్లేదు మామా... వాళ్లు చదివి మంచి ఉద్యోగం చేసుకుంటే చాలు." మామా: "అదే కదా అమ్మ మనసు." రాజా: "కానీ చెల్లి... చదువు ఖర్చులు కూడా ఎక్కువే కదా." చెల్లి: "అవునురా తమ్ముడా. అయినా పిల్లల చదువును ఆపలేం కదా." ఇంతలో తమ్ముడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. తమ్ముడు: "అమ్మా!" చెల్లి: "ఏమిరా?" తమ్ముడు: "నా షూస్ చిరిగిపోయినయి." చెల్లి: "మళ్లీనా?" తమ్ముడు: "నిజమే అమ్మా... చూడు." మామా: "రా తమ్ముడా... చూపించు." తమ్ముడు: "ఇదిగో మామా." మామా: "కొత్తవి కొనాలి." చెల్లి: "ఈ నెల ఖర్చులు చాలా ఉన్నాయి మామా." మామా: "పిల్లల మీద పెట్టేది ఖర్చు కాదు చెల్లి." తమ్ముడు: "మామా... నేను పెద్దయ్యాక పోలీస్ అవుతా." మామా: "ఎందుకు రా?" తమ్ముడు: "మా ఊర్లో అందరికీ న్యాయం చేస్తా." మామా నవ్వి పిల్లాడి తల నిమిరాడు. మామా: "బాగా చదువు రా. న్యాయం చేసే ముందు నిజాయితీ నేర్చుకో." తమ్ముడు: "సరే మామా." ఈ చిన్న సంభాషణలో పల్లె భవిష్యత్తు ఉంది. సాయంత్రం అయ్యేసరికి ఊరి చెట్టు కింద మళ్లీ అదే గుంపు చేరింది. వావా: "ఏంద్రా మామా... పాత రోజులు గుర్తున్నయా?" మామా: "ఎందుకు రావు వావా? అప్పట్లో ఈ చెట్టు కింద సాయంత్రం అయితే ఊరంతా కూసునేది." బావా: "అప్పుడు ఫోన్లు లేవు." రాజా: "ఫోన్లు లేకపోతే ఏం చేసేవాళ్లు?" వావా: "మనుషులతో మాట్లాడేవాళ్లం!" అందరూ నవ్వారు. మామా: "అదే తేడా రా." రాజా: "ఇప్పుడు?" మామా: "ఇప్పుడు పక్కన కూసున్నోడితో మాట్లాడం. దూరంగా ఉన్నోడితో ఫోన్‌లో మాట్లాడతాం." బావా: "పక్కింటి మనిషి ఇంట్లో ఏం జరుగుతుందో తెల్వదు. కానీ ఫోన్‌లో ఎవరు ఏం పెట్టారో మాత్రం అందరికీ తెలుసు." మళ్లీ నవ్వులు. కానీ ఆ నవ్వులో ఆలోచన ఉంది. కాలం మారడం తప్పు కాదు. మార్పు అవసరమే. పల్లెకు రోడ్లు రావాలి. పాఠశాలలు మెరుగుపడాలి. ఆసుపత్రులు అందుబాటులోకి రావాలి. ఇంటర్నెట్ రావాలి. యువతకు కొత్త అవకాశాలు రావాలి. కానీ ఈ మార్పుల మధ్య మనిషి మనిషికి దూరం కాకూడదు. ఒకప్పుడు "రా" అనే పిలుపు సరిపోయేది. ఇప్పుడు "వస్తావా?" అని ఫోన్ చేయాలి. ఒకప్పుడు పక్కింట్లో పొయ్యి వెలిగితే వాసన చూసి వెళ్లేవారు. ఇప్పుడు తలుపు మూసుకుని తమ తమ ప్రపంచాల్లో ఉంటున్నారు. అందుకే పల్లె అభివృద్ధితో పాటు పల్లె సంస్కృతిని కూడా కాపాడాలి. పల్లె సంస్కృతి అంటే కేవలం పండుగలు కాదు. కేవలం జాతరలు కాదు. కేవలం బతుకమ్మ కాదు. కేవలం సంప్రదాయ దుస్తులు కాదు. పల్లె సంస్కృతి అంటే ఒక మనిషి మరో మనిషిని తనవాడిగా భావించడం. "మామా" అని పిలవడం. "బావా" అని పలకరించడం. "చెల్లి" అని ఆప్యాయంగా మాట్లాడటం. "తమ్ముడా" అని తల నిమరడం. "అక్కా" అని గౌరవించడం. "అమ్మ" అని పిలవడం. ఈ పిలుపులన్నీ సమాజాన్ని కలిపే కనిపించని దారాలు. రైతు పొలంలో నిలబడి ఉంటాడు. వావా: "మామా... ఈసారి పంట ఎట్లుంటుందో?" మామా: "వాన మీదే ఉంది రా." వావా: "వాన పడితే పంట. పంట పండితే ధర." బావా: "ధర ఉంటే అప్పు తీర్చాలి." రాజా: "అప్పు తీరితే?" వావా: "మళ్లీ వచ్చే పంటకు అప్పు!" అందరూ నవ్వారు. అది నవ్వు కాదు. రైతు బతుకులోని నిజం. అయినా రైతు మరుసటి రోజు మళ్లీ పొలానికి వెళ్తాడు. ఎందుకంటే అతని దగ్గర ఒకటి ఉంటుంది—ఆశ. వాన వస్తుందన్న ఆశ. పంట పండుతుందన్న ఆశ. పిల్లలు చదువుకుంటారన్న ఆశ. ఇల్లు బాగుపడుతుందన్న ఆశ. బతుకు మారుతుందన్న ఆశ. అదే ఆశ పల్లెను నిలబెడుతోంది. కూలీ కూడా అంతే. కూలీ: "ఈరోజు పని ఉందా?" రైతు: "ఉంది రా... పొలంకాడికి రా." కూలీ: "రోజు కూలీ ఎంత?" రైతు: "మనకు చేతనైనంత ఇస్తా." కూలీ: "సరే అన్నా... పని ఉంటే చాలు." ఇక్కడ కూడా ఒక బంధం ఉంటుంది. ఒకరి పొలం, మరొకరి కష్టం. ఒకరి పంట, మరొకరి శ్రమ. మహిళల మాటల్లో మరో ప్రపంచం ఉంటుంది. అక్క: "చెల్లి... పిల్లల్ని పంపించావా?" చెల్లి: "పంపించా అక్కా." అక్క: "నువ్వు తిన్నావా?" చెల్లి: "లేదు." అక్క: "ముందు నువ్వు తిను. పని ఎప్పుడూ ఉంటుంది." ఈ మాటలో కూడా పల్లె మహిళల మమకారం ఉంది. ఇలా చూస్తే "తిన్నావా?" అనేది పల్లె జీవితంలో ఒక సామాజిక భాష. అది ఆకలి భాష. అది ఆరోగ్యం భాష. అది బంధం భాష. అది బాధ్యత భాష. అది ప్రేమ భాష. అందుకే పల్లె ప్రజలు మాట్లాడే మాటలను తక్కువగా చూడకూడదు. పల్లె యాసను ఎగతాళి చేయకూడదు. పల్లె మాటలో వ్యాకరణం వెతకడం కంటే, ఆ మాట వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలి. "ఏంద్రా?" అన్న మాటలో ఆప్యాయత ఉండొచ్చు. "రా" అన్న మాటలో స్నేహం ఉండొచ్చు. "బావా" అన్న మాటలో బంధం



ఉండొచ్చు. "మామా" అన్న మాటలో గౌరవం ఉండొచ్చు. "ఏం తిన్నావ్?" అన్న మాటలో ప్రేమ ఉండొచ్చు. అందుకే పల్లె భాషను పుస్తక భాషతో కొలవకూడదు. పల్లె భాష తనదైన ప్రపంచం. తనదైన శబ్దం. తనదైన వేడి. తనదైన మమకారం. ఈ భాషలోనే ఒక తల్లి తన కొడుకును అడుగుతుంది— "తిన్నావా బిడ్డా?" ఒక అన్న తన చెల్లిని అడుగుతాడు— "ఎట్లున్నావ్?" ఒక తమ్ముడు తన అక్కను అడుగుతాడు— "ఎప్పుడు వస్తావ్?" ఒక రైతు పక్క రైతును అడుగుతాడు— "నీళ్లు వచ్చాయా?" ఒక కూలీ మరో కూలీని అడుగుతుంది— "రేపు పని ఉందా?" ఒక మామ తన బావను అడుగుతాడు— "ఇంట్లో అందరూ బాగున్నారా?" ఈ ప్రశ్నలన్నీ కలిపితే ఒక పల్లె సమాజం తయారవుతుంది. కానీ మరోవైపు పల్లె ప్రజల మౌనం కూడా మనం అర్థం చేసుకోవాలి. "మా సమస్య చెప్పినా ఎవరు వింటారు?" "ఎవరి దగ్గరికి పోవాలి?" "మళ్లీ రేపు పని వాళ్ల దగ్గరే కదా!" "ఎందుకు గొడవ పెట్టుకోవాలి?" "పోనీలే... మన బతుకు మనదే." ఇలాంటి మాటలు వినిపిస్తాయి. ఈ మౌనాన్ని బలహీనతగా చూడకూడదు. చాలాసార్లు అది పరిస్థితుల వల్ల వచ్చిన జాగ్రత్త. పల్లె మనిషి ప్రశ్నించకపోతే అతనికి సమస్య లేదని కాదు. అతను ఎన్నిసార్లు చెప్పి అలసిపోయాడో కూడా కావచ్చు. అందుకే పాలనలో మొదటి పని పల్లె మనిషి మాట వినడం. అధికారి గ్రామానికి వెళ్లాలి. ప్రజల మధ్య కూర్చోవాలి. "ఏం సమస్య?" అని అడగాలి. ప్రజలు మాట్లాడే భాషలో సమాధానం వినాలి. అప్పుడే అసలు సమస్య బయటపడుతుంది. ఒక గ్రామానికి రోడ్డు కావాలి అంటే ఫైల్‌లో "రోడ్డు అవసరం" అని రాయడం ఒక విషయం. కానీ అక్కడి వృద్ధుడు "అయ్యా... మా అంబులెన్స్ లోపలికి రాదు" అని చెప్పడం మరో విషయం. ఒక గ్రామానికి నీళ్లు కావాలి అంటే గణాంకాల్లో ఒక సంఖ్య. కానీ ఒక మహిళ "మూడు గంటలకు లేచి బిందె పట్టుకుని వెళ్లాలి" అంటే అది బతుకు. ఒక పాఠశాలలో విద్యార్థులు ఉన్నారని గణాంకం చెబుతుంది. కానీ తల్లి "మా పిల్లాడికి మంచి మాస్టారు కావాలి" అంటే అది ఆశ. అందుకే పల్లె గొంతు వినాలి. పల్లె మాటను రికార్డు చేయాలి. పల్లె సమస్యను పరిష్కరించాలి. పల్లె ప్రజల గౌరవాన్ని కాపాడాలి. రాత్రి మళ్లీ చెట్టు కింద అందరూ కూర్చున్నారు. రాజా: "మామా... మన ఊరు ఎప్పుడైనా పూర్తిగా మారుతుందా?" మామా: "మారుతుంది రా." రాజా: "రోడ్లు బాగవుతాయా?" మామా: "బాగవుతయి." రాజా: "నీళ్ల సమస్య పోతుందా?" మామా: "పోవాలి." రాజా: "పిల్లలకు ఉద్యోగాలు వస్తాయా?" మామా: "వచ్చేలా చదివించాలి." రాజా: "మరి మనం ఏం చేయాలి?" మామా కొద్దిసేపు ఆలోచించి అన్నాడు— "మన ఊరి సమస్యను మనమే మర్చిపోకూడదు. మాట్లాడాలి. ప్రశ్నించాలి. కానీ మనిషిని ద్వేషించకుండా సమస్యను ప్రశ్నించాలి. మన ఊరిని మనమే కాపాడుకోవాలి." వావా తల ఊపాడు. వావా: "మాట నిజమే మామా." బావా: "మాట ఉండాలి. కానీ మనసు పోకూడదు." చెల్లి: "మనసు ఉంటేనే ఊరు ఉంటుంది." తమ్ముడు: "ఊరు ఉంటేనే మనం ఉంటాం." మామా నవ్వాడు. మామా: "అదే అసలు పల్లె బుద్ధి రా." చీకటి మరింత పెరిగింది. అందరూ ఇళ్లకు బయల్దేరారు. రాజా: "సరే మామా... రేపు కలుద్దాం." మామా: "అవునురా." రాజా: "రేపు మా ఇంటికి రావాలి." మామా: "ఎందుకు?" రాజా: "జొన్న రొట్టె చేస్తుంది అమ్మ." మామా: "అయితే తప్పకుండా వస్తా!" వావా: "నన్నూ పిలువు." బావా: "నన్నూ!" చెల్లి: "అందరికీ పెడితే అమ్మకు పని ఎక్కువ." లోపల నుంచి అమ్మ గొంతు వినిపించింది— "పల్లె ఇంటి పొయ్యి మనుషుల కోసం వెలగాలి! అందరూ రండి... అందరికీ పెడతా!" అందరూ నవ్వారు. అది ఆ రోజు కథకు ముగింపు. కానీ పల్లెకు కాదు. మరుసటి ఉదయం మళ్లీ కోడి కూస్తుంది. మళ్లీ పొయ్యి వెలుగుతుంది. మళ్లీ రైతు పొలానికి బయల్దేరుతాడు. మళ్లీ పిల్లలు స్కూల్‌కు వెళ్తారు. మళ్లీ కూలీ పనికోసం బయల్దేరుతుంది. మళ్లీ ఎవరో ఒకరు ఎవరో ఒకరిని చూసి అడుగుతారు— "ఏంద్రా మామా... ఏం తిన్నావ్?" ఆ ప్రశ్నకు ఎదుటివాడు కూడా నవ్వుతూ చెబుతాడు— "ఏం లేదురా బావా... నువ్వున్నావ్ కదా... అదే చాలు!" ఇదే పల్లె మనసు. ఇదే పల్లె బంధం. ఇదే పల్లె భాష. ఇదే మనిషితనం. పల్లె అభివృద్ధి చెందాలి. కానీ పల్లె మనసు మాయమవ్వకూడదు. కొత్త రోడ్లు రావాలి. కానీ పాత పలకరింపు పోకూడదు. కొత్త ఇళ్లు రావాలి. కానీ పక్కింటి తలుపు తట్టే అలవాటు పోకూడదు. ప్రతి ఇంట్లో ఫోన్ ఉండాలి. కానీ ఒక మనిషి కష్టంలో ఉన్నప్పుడు ఫోన్ పక్కన పెట్టి అతని దగ్గరకు వెళ్లే మనసు కూడా ఉండాలి. పల్లెను మార్చేది ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదు; ఒక మనిషి మరో మనిషికి ఇచ్చే చేయూత కూడా. పల్లెను నిలబెట్టేది భవనాలు మాత్రమే కాదు; బంధాలు కూడా. పల్లెను గొప్పదిగా చేసేది సంపద మాత్రమే కాదు; పంచుకునే మనసు కూడా. అందుకే పల్లె వీధుల్లో ఆ మాట ఎప్పటికీ వినిపించాలి—

**"ఏంద్రా మామా... ఏం తిన్నావ్?"**

ఆ మాట ఉన్నంతకాలం పల్లె బతికే ఉంటుంది. ఆ పలకరింపు ఉన్నంతకాలం మనిషితనం బతికే ఉంటుంది. ఆ బంధం ఉన్నంతకాలం మన సమాజం బలంగా ఉంటుంది.

పల్లె మారాలి... కాలంతో పాటు ముందుకు సాగాలి... కానీ పల్లె మనసు మాత్రం ఎప్పటికీ మారకూడదు.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## నవాబుపేట్ యువత తో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆత్మీయ సమ్మేళనం

**నవాబుపేట్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట్ మండల కేంద్రంలో లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్లో కడిచేర్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

'సంధ్యారావు' ఫేక్ అకౌంట్‌పై సైబర్ క్రైమ్ ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన "సంధ్యారావు" అనే ఎక్స్ (ట్విట్టర్) ఖాతా పూర్తిగా నకిలీదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ ఫేక్ అకౌంట్‌ను ఎవరు నిర్వహిస్తున్నారో తేల్చాలంటూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ డ్రామా వెనుక ముఖ్యమంత్రి హస్తం ఉందని ఆయన విమర్శించారు. కేసీఆర్‌పై వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కేసీఆర్‌ను ఉద్దేశించి చేసిన చావుకు డబ్బులు పంపిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. అని అన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యల నుండి దృష్టి మరల్చడానికే బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తున్నారని అని అన్నారు. ఉద్యోగుల పీఆర్‌సీ ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీ. డీఏల చెల్లింపుల విషయంలో ఆలస్యంపై సీఎం రేవంత్ రెడ్డి తీరును తప్పుబడుతూ తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

కళ్యాణ లక్ష్మి పథకం నిలిపివేతపై మండిపాటు: తెలంగాణలో కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఒకే రోజు పలు జీవోల అమలు నిలిచిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, కార్యకర్తల్లో భరోసా నింపడానికి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను వేర్వేరు సందర్భాల్లో విరివిగా నిర్వహిస్తోంది. అని అన్నారు. ఈ సమ్మేళనాలకు సంబంధించిన ప్రధాన అంశాలుపార్టీ పునర్నిర్మాణం కార్యాచరణ గత ఎన్నికల అనంతరం పలు నియోజకవర్గాల్లో నేతల మార్పులు జరిగిన నేపథ్యంలో, ఉనికిని చాటుకోవడానికి మరియు క్యాడర్‌లో ధైర్యం నింపడానికి మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ప్రాంతాలవారీగా ఆత్మీయ సమ్మేళనాలు సాగుతున్నాయి. నేతలు భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అని అన్నారు. సుధాకర్ జన్మదిన పురస్కరించుకొని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతిలో మీదుగా కేకు కట్ చేయించడం జరిగింది. వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఇటీవల తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సబితా ఇంద్రారెడ్డి సునీత లక్ష్మారెడ్డి పై పోలీసులు చేసిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా నవాబుపేట మండలానికి చెందిన కడి చర్ల సుధాకర్ జన్మదిన వేడుకలు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనందం, నవాబ్పేట్ మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాగేందర్ గౌడ్, దేశమొల్ల ఆంజనేయులు, భరత్ రెడ్డి, విజయ్ క్షత్రియ, విజయ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పురుషోత్తం చారి శాంతి కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ బార్వాది నరేందర్ రెడ్డి, గొల్లగూడ మహేష్ , రైతు సంఘం మండల అధ్యక్షులు మల్లేశం,మహేశ్వర్ రెడ్డి, కావాలి రాజు, సంతోష్‌కుమార్, పి మాణిక్ రెడ్డి , తలారి శేఖర్, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నవాబ్‌పేటలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

- **మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే నా లక్ష్యం.**
- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి**
- **వెంకట్‌రెడ్డికి మండల అధ్యక్షులుగా నియామక పత్రం అందజేత.**

**నవాబుపేట సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీని నవాబ్ పేట్ మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నూతన మండల అధ్యక్షుడు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి సూచించారు.నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రావుగారి వెంకట్ రెడ్డి గత నెల నియమితులైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులు నర్సింహా రెడ్డి చేతుల మీదుగా శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రావుగారి వెంకట్ రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులు నర్సింహా రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడిగా వెంకట్ రెడ్డి విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



అనంతరం అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను ఐసమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వెంకట్ రెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకట్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## తెలంగాణ యన్ యస్ యు ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియామకం.

- **నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..కాలే చంద్రకాంత్**

**నవాబుపేట్ సెప్టెంబర్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా తనకు బాధ్యతలు అప్పగించిన నాయకులకు ఎమ్మెల్యే తనయుడు కాలే చంద్రకాంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి కీలక బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలే చంద్రకాంత్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువతకు మరింత ప్రాధాన్యత కల్పించేలా కార్యక్రమాలు చేపడతానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా, నాయకులు తనపై ఉంచిన నమ్మకానికి ప్రతీకగా భావిస్తున్నానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ యన్ యస్ యు ఐ.ని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ



కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేసే విధంగా పని చేస్తానని కాలే చంద్రకాంత్ స్పష్టం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన నాయకుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394